GET THE LATEST UPDATES AND NEWS DIRECTLY THROUGH THE WHATSAPP
JOIN NOW
STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL

GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం


తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 140 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శనివారం 09 ఆగస్టు 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్



1959 - 2024
దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్



# సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ



## రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం ద్వారా సాయం మెయిన్స్‌కు ఎంపికైన వారికి లక్ష చెక్కు అందించిన భట్టి

**హైదరాబాద్,ఆగస్ట్11(సమయజ్యోతి):**

సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి ఎంతో కొంత సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద సివిల్స్-2025లో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష చెక్కులను మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా అభ్యర్థులకు సాయం అందిస్తామన్నారు.

మిగతా 2 లో

# ఎంపిలకు మరో కొత్త నివాస సముదాయం

## కొత్త సముదాయాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్11(సమయజ్యోతి):**

ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఎంపీల నివాస సముదాయాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి మోడీ ఎంపీల ఫ్లాట్లు- ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఇకపై ఎంపీల కొత్త నివాసాల్లో ఎటువంటి సమస్యలు ఎదుర్కోరని.. పనిపై ఎక్కువ దృష్టి పెడతారని చెప్పారు. అద్దె భవనాల నుంచి పని చేసే మంత్రిత్వ శాఖల అద్దె ఏటా రూ.1,500 కోట్లు- ఖర్చు అవుతుందని చెప్పారు. అలాగే ఎంపీలకు కూడా సరైన నివాసాలు లేకపోవడంతో ప్రభుత్వ ఖర్చులు కూడా చాలా ఎక్కువగా అవుతున్నాయని వెల్లడించారు. నివాసాల కొరత ఉండడంతో 2014 నుంచి 2024 వరకు దాదాపు 350 మంది ఎంపీలకు కొత్త నివాసాలు నిర్మించినట్లు- తెలిపారు. తాజాగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనంలో 184 మందికి పైగా ఎంపీలు కలిసి నివాసం ఉండొచ్చని చెప్పారు. ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో కొత్త నివాస సముదాయాన్ని నిర్మించారు. -టైప్-÷ఎఒఒలో భాగంగా 184 ఫ్లాట్లతో బహుళ అంతస్తులతో ఈ నిర్మాణం చేపట్టారు. సోమవారం ఈ నివాసాన్ని ప్రారంభించే ముందు ప్రాంగణంలో సింధూర మొక్కను మోడీ నాటారు. అనంతరం కార్మికులతో సంభాషించారు. ప్రతీ ఫ్లాట్ చాలా విశాలంగా నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ భవనం అల్యూమినియం షట్టరింగ్‌తో కూడిన మోనోలిథిక్ కాంక్రీటును ఉపయోగించి నిర్మించారు.




# లోక్‌సభ ముందుకు కొత్త ఆదాయపన్ను చట్టం

## ప్రవేశ పెట్టిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ,ఆగస్టు11(సమయజ్యోతి):**



కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఆదాయపు పన్ను (నం.2) బిల్లు-2025ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వాస్తవానికి ఈ బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. అయితే.. విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాన్ని సెలెక్ట్ కమిటీకి పంపించింది. కమిటీ- ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం.. దానికి అనుగుణంగా నవీకరించి మరోసారి లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. అదేవిధంగా టాక్సేషన్ చట్టాల (సవరణ) బిల్లునూ ప్రవేశపెట్టింది. సెలెక్ట్ కమిటీ- సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు- కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు.

# సమస్యల పరిష్కారంలో పట్టువిడుపులు ఉండాలి

## షూటింగ్‌ల నిలిపివేత సరైన నిర్ణయం కాదు కలిసి చర్చించుకోవాలని కార్మికు సంఘాలకు మంత్రి సూచన

**హైదరాబాద్,ఆగస్ట్11(సమయజ్యోతి):**

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఉన్న సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పట్టువిడుపులతో ఉండాలని నిర్మాతలు, ఫెడరేషన్ ప్రతినిధులకు మంత్రి సూచించారు. ఒకరి ఇబ్బందులను మరొకరు అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కమిటీ- ఏర్పాటు- చేసుకోవాలని.. నిర్మాతలు, ఫెడరేషన్ ప్రతినిధులు మంగళవారం మరోసారి చర్చించుకోవాలని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దిల్ రాజుకు మంత్రి సూచించారు.

మిగతా 2 లో



# లోక్‌సభలో నాలుగు కీలక బిల్లులకు ఆమోదం

## ఐటి, స్పోర్ట్స్ బిల్లులకు సభ మద్దతు

**న్యూఢిల్లీ,ఆగస్ట్11(సమయజ్యోతి):**

విపక్షాల నుంచి సర్‌పై నిరసనలు గందరగోళం నడుమనే లోక్‌సభలో సోమవారం మొత్తం నాలుగు కీలకమైన బిల్లులు ఆమోదం పొందాయి. రెండు ఆదాయపు పన్ను పన్నుల వసూళ్లకు సంబంధించినవి, మరో రెండు క్రీడావిధానాల సంస్కరణల పరిధిలోకి వచ్చేవి. పన్నుల విధింపు సంబంధిత ఇన్‌కం టాక్స్ (నెంబరు 2) ,పన్నుల విధింపునకు సంబంధించిన టాక్సేషన్ లాస్ (సవరణ) బిల్లు ఇప్పుడు సభామోదం దక్కించుకున్నాయి. సోమవారం ఉదయం సభ ఆరంభం కాగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. దేశంలో అమలులో ఉన్న ఆదాయపు పన్ను బిల్లు 1961 నాటి ఆదాయ పన్ను చట్టం నిబంధనలకు అనుగుణంగా ఉంది. ఈ చట్టాన్ని సవరించి , సరైన విధంగా పటిష్టం చేసేందుకు ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లు తీసుకువచ్చారు. ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందితే పాత చట్టం స్థానంలో కొత్త చట్టం అమలులోకి వస్తుంది. ఆదాయపు పన్ను చట్టం అంశాలను పరిశీలించేందుకు బిజెపి సీనియర్ ఎంపి బైజ్యనాథ్ పాండా సారధ్యంలో ఏర్పాటు- అయిన సెలెక్ట్ కమిటీ- సిఫార్సులను ఈ బిల్లులో పొందుపర్చారు. ఇక పన్నుల విధింపు సంబంధిత బిల్లు పన్నుల వ్యవస్థీకృత పద్ధతులలో మార్పునకు ఉద్దేశించింది. ఈ క్రమంలో ఈ ఏడాది తీసుకువచ్చిన ఫైనాన్స్ యాక్ట్‌ను కూడా సవరించడం జరుగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఐటి బిల్లు 2025లో పలు మార్పులు చేర్పులను సెలెక్ట్ కమిటీ- సిఫార్సు చేసింది. ఇవి కూడా ఇప్పటి తాజా బిల్లులో చేరాయి. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్‌పై ప్రతిపక్షాలు సభలో తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తం చేయడంతో సభా కార్యక్రమాల దశలో గందరగోళం ఏర్పడిన దశలోనే ఈ రెండు బిల్లులు ఆమోదం పొందినట్లు- సభాధ్యక్ష స్థానం నుంచి ప్రకటన వెలువడింది.

# కాగ్ త్రైమాసిక నివేదిక

## ఆదాయం తగ్గడంపై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,ఆగస్ట్11(సమయజ్యోతి):**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగ్ క్వార్టర్లీ రిపోర్టుపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాగ్ త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోంది. ఆరు గ్యారెంటీ-ల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసింది. రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయి. రూ. 2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్‌లో చూపారు. మొదటి త్రైమాసికానికే రూ. 10,583 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. మూడు నెలల్లోనే రూ. 20,266 కోట్లు- అప్పుగా తీసుకున్నారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఆర్థిక రంగాన్ని ఎలా గాడిన పెడుతారో కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు చెప్పగలరా..? అని కేటీఆర్ నిలదీశారు.



# సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

మొదటిపేజీ తరువాయి

ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదని, సమాజానికి అందించే ఓ బాధ్యత అనిభట్టి విక్రమార్క అన్నారు. మానవ వనరులు అత్యంత బలమైన పెట్టుబడి అని, మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. గతేడాది అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారని, 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలన్నారు. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం జరిగింది. మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగ పడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకు ఎంతో కొంత సాయం అందించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం. మొత్తం సాయం కాకపోయినా.. కొంత మీకు అండగా ఉండాలని అభయ హస్తం ఇస్తున్నాం. మెయిన్స్‌కు వెళ్తున్న వారికి లక్ష సాయం చేస్తున్నాం, కొంత కొచించ్‌కి ఉపయోగ పడుతుందని ప్రభుత్వ ఆలోచన. లాస్ట్ ఇయర్ అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారు. 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలి. సివిల్ సర్వెంట్‌ల సమావేశాల్లో కొందరు ఐఏఎస్‌లను రోల్ మోడల్‌గా చెప్తారు. మాధవరావు, ఎస్ఆర్ శంకరన్ లాంటి వాళ్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాం. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుంది. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదు.. సమాజానికి అందించే బాధ్యత. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టు-కోవాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సక్సెస్ అవుతాయి. మాకు ఎంత చేయాలి అని ఉన్నా.. ఐఏఎస్‌లలో నిబద్ధత లేకుంటే లక్ష్యం చేరుకోలేం. శంకరన్ లాంటి వాళ్లు సంక్షేమ శాఖల్లో పని చేశారు. మిషన్ లాగ పని చేస్తే.. ప్రజలు కూడా మిషన్ లాగే మర్చిపోతారు. సవాళ్లను అధిగమించి లక్ష్యం సాధించండని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి.. ఇవాళ సివిల్స్‌కి వెళ్లే వారి వరకు అందరికీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నాం. 55 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణ కి ఇప్పటికే టెండర్లు పిలిచాము. రైతు కొడుకు రైతే అవుతున్నాడు. మేము ఐదేళు .. పదేళ్లు పదవుల్లో ఉంటాం. సివిల్స్ సాధించి మీరు ప్రజల సేవలో ఉండండి. కాన్ఫిడెన్స్‌తో సివిల్స్ ప్రిపేర్ అవ్వాలి. డిల్లీలో నా క్వార్టర్స్‌ను చదువుకునే వారికే ఇచ్చా.

నా క్వార్టర్స్‌లో ఉండి చదువుకున్న ఇద్దరు ఇప్పుడు నా జిల్లాలోనే సర్వీసులో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

# సమస్యల పరిష్కారంలో పట్టువిడుపులు ఉండాలి

## -షూటింగ్‌ల నిలిపివేత సరైన నిర్ణయం కాదు

## -కలసి చర్చించుకోవాలని కార్మికు సంఘాలకు మంత్రి సూచన

**హైదరాబాద్,ఆగస్ట్11(సమయజ్యోతి):**





తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఉన్న సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పట్టువిడుపులతో ఉండాలని నిర్మాతలు, ఫెడరేషన్ ప్రతినిధులకు మంత్రి సూచించారు. ఒకరి ఇబ్బందులను మరొకరు అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కమిటీ- ఏర్పాటు- చేసుకోవాలని.. నిర్మా తలు, ఫెడరేషన్ ప్రతినిధులు మంగళ వారం మరోసారి చర్చించుకోవాలని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దిల్ రాజుకు మంత్రి సూచించారు. సినీ కార్మికుల వేతనాలు పెంచాలని గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫిల్మ్ ఫెడరేషన్ షూటింగ్‌లను నిలివేస్తున్నట్లు- నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. పని చేస్తూనే తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలి కానీ, షూటింగ్‌లను నిలిపివేయడం సరైనది కాదని ఆయన అన్నారు. సోమవారం ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు, నిర్మాత, ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజుతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో నిర్మాతలు సుప్రియ, జెమిని కిరణ్, దామోదర్ ప్రసాద్ ఉన్నారు. పరిశ్రమలో నెలకొన్న తాజా పరిస్థితులపై సమావేశంలో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎస్ఎల్బీసీ టన్నెల్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం తన మీద కోపం ఎస్ఎల్‌బిసి మీద చూపిస్తుందని ఆరోపించారు. ఇది కూలిపోవాలని కేసీఆర్ ఫామ్ హౌజ్‌లో క్షుద్ర పూజలు చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 43 కిలోమీటర్లు ఉన్న ఈ టన్నెల్ ఓ అద్భుతమని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ కట్టిన కాళేశ్వరం అసలు అద్భుతమే కాదని విమర్శించారు. కాళేశ్వరం నివేదిక రావడంతో.. బీఆర్ఎస్ నాయకులు నోళ్లు మెదపడం లేదని పేర్కొన్నారు. నివేదికతో బీఆర్ఎస్ బాగోతం బట్టబయలైందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిందని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టడానికి బీఆర్ఎస్ నాయకులు కల్లిబొల్లి మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌పై నమ్మకంతోనే ప్రజలు ఎన్నికల్లో గెలిపించారని స్పష్టం చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మంత్రి వివరించారు.

# 14న కరీంనగర్‌లో బిసి కదనభేరీ

## -బిసిల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ కుట్ర-ఏర్పాట్లను పరిశీలించిన మాజీమంత్రులు

**కరీంనగర్,ఆగస్ట్11(సమయజ్యోతి):**





బిసిల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ ఆరోపించారు. బిసిలకు న్యాయం జరగాలంటే తమిళనాడు తరహాలో పోరాడాలని తాము కాంగ్రెస్‌కు సూచించినట్లు- చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఈనెల 14న కరీంనగర్‌లో 'బిసి కదనభేరి' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సభకు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సభకు సంబంధించిన సన్నాహక సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. మంత్రి తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ..అధికారంలోకి వస్తే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని, ఏటా రూ.20 వేల కోట్లు- కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు కేవలం ఓ తీర్మానం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. కుల గణన, 42 శాతం రిజర్వేషన్ల అంశాలపై లోక్‌సభ ఎన్నికలకు ముందు హడావిడి చేసి ఇప్పుడు ఏమీ చేయడం లేదని ఆరోపించారు.

సిఎం రేవంత్ రెడ్డి బిసిల పట్ల చులకనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించవద్దని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎంఎల్ఎ గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పుడు మోసపూరిత నాటకాలు ఆడుతోందని విమర్శిం చారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ప్రధానిని, రాష్ట్రపతిని కలిసేందుకు ప్రయత్నించారా? అని ప్రశ్నించారు .వంద మంది ఎంపిలు ఉన్న కాంగ్రెస్ పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. బిసిలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించింది, ఆర్‌టిసి ఛైర్మన్‌గా, హైదరాబాద్ మేయర్‌గా బిసిలకే అవకాశం ఇచ్చింది కెసిఆర్ అని గుర్తుచేశారు. మంత్రులుగా కూడా బిసిలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చింది గత ప్రభుత్వమేనని చెప్పారు. శాసనమండలిలో పక్ష నేత మధుసూదనచారి మాట్లాడుతూ.. బిసిల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌ఓ చేర్చడమే ఏ-కై-క మార్గమని చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివా స్ గౌడ్ మాట్లాడుతూ..42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి బిసిల సంఖ్యను తక్కువగా చూపారని విమర్శించారు. కేంద్రానికి పంపిన ఆర్డినెన్స్ ముసాయిదాలో రాజకీయ రిజర్వేషన్ల అంశం మా త్రమే ఉందని, విద్య, వైద్యం వంటి ఇతర రంగాలను కావాలనే విస్మరించారని ఆరోపించారు. సమావేశంలోఎంఎల్‌సిలు బండ ప్రకాష్, ఎల్. రమణ, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్, బిసి కమిషన్ మాజీ వకులాభరణం కష్ణమోహన్, జెడ్‌పి మాజీ ఛైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, దావ వసంత, మాజీ ఎంఎల్‌లు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఒడితెల సతీష్ బాబు, విద్యాసాగర్ రావు, కోరుకంటి చందర్, మాజీ ఎంఎల్‌సి నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు బండ శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కరీంనరగర్ జిల్లా కేంద్రంలోని బిసి కదనభేరి సభ స్థలమైన మహాత్మాజ్యోతిబాపులే మైదానాన్ని నేతలు పరిశీలించారు.

# కరీంనగర్ సూపర్‌మార్కెట్‌లో గడువు తరచిన వస్తువులు క్రయించ బడుతున్నాయని ఆహార భద్రతపై ఆందోళన

**కరీంనగర్, ఆగస్టు 11, 2025 సమయజ్యోతి**

నకచౌరస్తా ప్రాంతంలోని ఒక సూపర్‌మార్కెట్‌లో గడువు తరచిన ఆహార వస్తువులు విక్రయించబడుతున్నట్లు ఒక స్థానిక షాపర్ ఇటీవల వెల్లడించి ఆహార భద్రతపై ఆందోళనలకు కారణమైంది.ఆగస్టు 9న, ఆ షాపర్ ఫ్రెష్ క్రీమ్ మరియు కొన్ని స్నాక్స్ కొనుగోలు చేసారు. పిల్లల కోసం డెజర్ట్ తయారుచేస్తుండగా, ఆ క్రీమ్ ఆగస్టు 5న గడువు తీరిందని గమనించారు ౹ ఇది కొనుగోలు చేసిన 4 రోజుల ముందు. ఈ విషయాన్ని గుర్తించి, ఆ వ్యక్తి సూపర్‌మార్కెట్‌కు తిరిగి వెళ్లి షెల్ఫ్‌లను పరిశీలించారు, అక్కడ మరిన్ని గడువు తీరిన వస్తువులు కూడా విక్రయానికి ఉంచబడ్డాయని గమనించారు, వాటిలో చాలా వస్తువులు పిల్లల కొరకు ప్రత్యేకంగా కొనుగోలు చేసేవి.ఈ సంఘటనను వీడియోలో రికార్డు చేసుకున్న ఆ షాపర్, ఆహార భద్రత అధికారులు దీన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు."గడువు తీరిన ఆహారాన్ని విక్రయించడం కేవలం తప్పిదమే కాదు, అది ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుంది, ముఖ్యంగా పిల్లలకు," అని ఆ వ్యక్తి తెలిపారు. "దయచేసి ఎప్పుడూ కొనుగోలు ముందు గడువు తేదీలను శ్రద్ధగా తనిఖీ చేయండి, స్టోర్ లేదా బ్రాండ్ ఎంత నమ్మదగినదైనా."ఇప్పటికీ అధికారిక చర్యలు చేపడుతున్నట్లు తెలియకపోయినా, ఈ సంఘటన సూపర్‌మార్కెట్ నిర్వహణలో జాగ్రత్త అవసరం మరియు వినియోగదారుల జాగ్రత్తపై ప్రధానమ్మెన సందేశాన్ని ఇస్తోంది.



## జగిత్యాల జిల్లాలో స్థానిక పరిపాలనపై

# నిర్లక్ష్య ఆరోపణలు

**సమయజ్యోతి, బుగ్గారం, జగిత్యాల జిల్లా ఆగస్టు 11, 2025**

జిల్లాలోని ఒక గ్రామం నివాసితులు స్థానిక పరిపాలనలో అన్యాయాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత లేకపోవడం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.వారు చేసిన ఫిర్యాదులో, గత కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఎటువంటి క్రిమినల్ కేసులు నమోదు కాకపోవడంపై వారు నిరాశను వ్యక్తం చేశారు. లోకాయుక్త, జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ల వంటి ఉన్నత అధికారుల ఆదేశాలు సైతం అమలు కాలేదని పేర్కొన్నారు.అంతేకాక, సమాచార హక్కు చట్టం ప్రకారం దాఖలైన దరఖాస్తులు, అప్పీళ్లు, ఇతర ప్రజా ఫిర్యాదులు అప్రతిష్టగా మిగిలిపోయాయని వివరించారు.ఈ అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు జిల్లా అధికారులను కోరారు.

# జాతీయ క్రీడల్లో బంగారు పతకం గెలిచిన రవి హై స్కూల్ విద్యార్థిని శ్రీ వైభవి రవి

**నిర్మల్, ఆగస్టు 11, 2025 సమయజ్యోతి**

రవి హై స్కూల్ 8వ తరగతి విద్యార్థిని శ్రీ వైభవి రవి, ఆగస్టు 2 నుండి 7, 2025 వరకు ముంబయిలో జరిగిన U13 GD నేషనల్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో బాలికల డబుల్స్ విభాగంలో బంగారు పతకం గెలుచుకుని తన పాఠశాలకే కాకుండా నిర్మల్ జిల్లాకూ గౌరవం తీసుకొచ్చింది.శ్రీ వైభవి అనుముల అమర్ కుమార్ మరియు లావణ్య దంపతుల కుమార్తె కాగా, రాజేశ్వర్ గారి మనుమరాలు. క్రీడల పట్ల ఆమెకు ఉన్న నిబద్ధత, ఆసక్తి ఆమెను ఈ విజయానికి నడిపించాయి. ఈ గెలుపు ఆమె ప్రతిభకు, కష్టపడి సాధించిన ఫలితానికి ప్రతీకగా నిలిచింది.రవి హై స్కూల్ యాజమాన్యం ఈ విజయాన్ని గర్వంగా జరుపుకుంది. కరస్పాండెంట్ శ్రీ వెంకటేశ్వరరావు గారు, ప్రిన్సిపాల్ రాణి మేడం గారు, ఉపాధ్యాయవర్గం శ్రీ వైభవిని అభినందించి, మరింత ముందుకు సాగాలని ప్రోత్సహించారు."పాఠశాల విద్య ఎంత ముఖ్యమో, క్రీడల్లో కూడ విద్యార్థులు అత్యుత్తమ స్థాయికి ఎదగగలరని వైభవి నిరూపించింది," అని ఒక పాఠశాల అధికార వక్త తెలిపారు.ఈ విజయం వైభవికి వ్యక్తిగత గౌరవాన్ని మాత్రమే కాకుండా, నిర్మల్ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారులకు ఒక ప్రేరణగా నిలిచింది.





# బిజెపి నాయకుల ఆర్థిక సాయం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలకేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నేత వడ్ల రాజేశ్వర్ సోదరి కల్లెడ రాజమణి అనారోగ్యంతో మృతి చెందగా, బీజేపీ నాయకులు వెళ్లి పరామర్శించి, అంత్యక్రియల సహాయార్థం 10వేల ఆర్థిక సహాయం చేసారు. ఆపదలో ఆదుకున్న బీజేపీ నాయకులకు రాజేశ్వర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో బీజేపీ మండల అధ్యక్షులు అంబటి నవీన్, నాయకులు లింగాగౌడ్, ఆరెపల్లి నర్సయ్య, మం, నాయకులు కొత్తింటి రాకేష్, సుంకం శ్రీనివాస్, తోపారం అశోక్, ఠాకూర్ రాము, తోట నవీన్, రాంకిషన్, సుబ్బాయి సాయిలు, మద్దుల రమేష్, గంగాధర్ పాల్గొన్నారు.



# కామిడి మధుసూదన్ రెడ్డి వర్ధంతి సందర్బంగా అన్న దానం

హన్మకొండ సమయ జ్యోతి ప్రతినిధి హన్మకొండ

భూపాల్ పల్లి జిల్లా చిట్యాల మండలము జడల్ పేట గ్రామానికి చెందిన దివంగత మాజీ మండల విద్యా దికారి కామిడి మధు సూధన్ రెడ్డి 26 వ వర్ధంతి సందర్భంగా బీమారం లోని లార్డ్స్ వృద్ధ ఆశ్రమం లో విశేష అన్న దానం నిర్వహించారు మధు సూధన్ రెడ్డి సతీమణి సుగుణ దేవి కుమారులు కామిడి సతీష్ రేడ్డి నరేశ్ రెడ్డి సోదరులు పద్మాకర్ రెడ్డి మనుమడు రాకేష్ రెడ్డి అల్లుడు రఘునాధ్ రెడ్డిలు అన్న దానం చేశారు తన అన్న కామిడి మధుసూధన్ రెడ్డి మండల విద్యాధికారిగా వివిధ మండల్లాల్లో విశేష సేవలు అందించారని వేలాది మందివిద్యార్థుల బంగారు భవిష్తత్తుకి బాటలు వేశారని వివి పాఠశాలల్లో అంకిత బావం తో చేసి కుటుంబ సంక్షేమం కోసం కృషి చేశారని వారి మంచి తనం మా కుటుంబానికి విలువ ఇచ్చిన వారు అని వారు మా అందరికీ స్పూర్తి అని తమ్ముడు పద్మాకర్ రెడ్డి వారి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వారి సేవలు కొనియాడారు లార్డ్స్ ఆశ్రమ నిర్వాహకులు నారగోని నరేష్ గౌడ్ పాల్గొన్నారు




# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి స్వీకరించే దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఆయన, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చిన మొత్తం 114 దరఖాస్తుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు 36, గృహ నిర్మాణ శాఖకు 26, డీఆర్డీఏ 20, ఉపాధి కల్పన శాఖకు 7 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రెడ్ల కార్పొరేషనును ప్రకటించాలి తెలంగాణ రెడ్డీ సంగం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జై పాల్ రెడ్డి



సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రెడ్డి కార్పొరేషన్ ను తక్షణమే ప్రకటించి నిధులను విడుదల చేయాలనితెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపూ జైపాల్ రెడ్డి అన్నారు రేగొండ మండలం బాగిర్తిపేట గ్రామంలో జరిగిన రెడ్డి సంఘం సర్వసభ్య సమావేశానికి అధ్యక్షులు రూపి రెడ్డి విజేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ పేద రెడ్లను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతైనా ఉందని విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో రెడ్లు వెనుకబడిపోతున్నారని అన్ని గ్రామాలలో రెడ్లు సంఘటితంగా ఉండి సమస్యల సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని పేద రెడ్లను ఆదుకోవాలని పేర్కొన్నారు ఇప్పటికే రెడ్లు గ్రామాలలో ఉపాధి లేక పట్టణాలకు నగరాలకు వలస పోతున్నారని వారి సంక్షేమం కోసం తగు చర్యలు తీసుకోవాలని అదేవిధంగా విద్యార్థుల కోసం రెడ్డి హాస్టల్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెడ్డి సంఘము రాష్ట్ర ఉపాధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పత్తి బుచ్చిరెడ్డి రాష్ట్ర కోఆర్డినేటర్ మాడుగుల పాపిరెడ్డి ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ భూశి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా రూపురెడ్డి విజేందర్ రెడ్డి కోశాధికారిగా రవీందర్ రెడ్డి ఉపాధ్యక్షులుగా కర్ణ కంటి వెంకటరెడ్డి కార్యవర్గ సభ్యులుగా కట్కూరి సత్యనారాయణరెడ్డి ఎన్నిక కాగా ఈ కార్యక్రమంలో నందికొండ శ్రీధర్ రెడ్డి దూదిపాలకృష్ణారెడ్డి రూపురెడ్డి రవీందర్ రెడ్డి సాంబ రెడ్డి రామ్ రెడ్డి బాపురెడ్డి సమిరెడ్డి పాకాల లక్ష్మారెడ్డి తిరుపతిరెడ్డి విజేందర్ రెడ్డి పాల్గొన్నారు

# ఇవ్ టీజింగ్ జరిగితే, షీ టీంకు సమాచారం ఇవ్వాలి:ఎస్సై శైలేందర్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్ చేసినా షీ టీంకు సమాచారం ఇవ్వాలని బాల్కొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినీలకు సోమవారం ఎస్సై శైలేందర్, సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళు ,, విగ్నేష్, సుమతి, పోలీస్ మమత రోహిణి లతో కలిసి అవగాహన కల్పించారు. విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే, షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినిల పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామని, షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం కు ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గారిగే భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.



# రైతు బీమా కు దరఖాస్తు చేసుకోవాలి



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి వనపర్తి జిల్లా

వనపర్తి జిల్లాలలో రైతులు రైతు బీమా చేసుకోవాలని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి కోరారు.జిల్లా రైతులు 05.06.2025 లోపు కొత్త పట్టా పాస్ పుస్తకం వచ్చి భీమ చేసుకోని రైతులు ఏవరైనా రైతులువుంటే తేది 13-8-2025 వరకు జిల్లా రైతులందరూ వివిధ మండల కేంద్రాలలోని వ్యవసాయ శాఖ కార్యాలయాల దగ్గర రైతు బీమా నామినేషన్ ఫారం నింపి దానికి రైతు ఆధార్ కార్డు, పాస్ బుక్, నామిని ఆధార్ కార్డుతో ఆయా మండలలోని రైతు వేదికల వద్ద వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు గానీ మండల వ్యవసాయ అధికారులకు గానీ రైతులు స్వయంగా వచ్చి సంతకం చేసి ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తుకు చివరి తేదీ 13 వ తేది వరకు ఉంది కాబట్టి ఇదివరకు భీమ ఉన్న రైతులు చేసుకోవద్దని రైతు భీమా అనేది రైతు మరణిస్తే 5 లక్షలు వచ్చే పథకం. రైతుల వయసు 18-59 సంవత్సరాలు ఉన్న రైతులు అర్హులు.ఇదివరకు భీమా ఉన్న రైతులు ఏమైనా మార్పులు చేయించుకోవాలంటే రైతు వేదికలోకి వచ్చి చేయించు కోవచ్చని. జత చేయవలసిన పత్రాలు ఆధార్ కార్డు జిరాక్స్, రైతు పొలం పాస్ బుక్ జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ లు తీసుకొని ఆయా మండల వ్యవసాయ శాఖ కార్యాలయాలలో సంప్రదించాలని రైతులను కోరారు.

# దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## : కలెక్టర్ అభిలాష అభినవ్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 11.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను వెంట వెంటనే అప్డేట్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు వేగవంతంగా పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో అధికారులంతా భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలులోకి వచ్చిన ఉపాధ్యాయుల ఫేసియల్ రికగ్నైజింగ్ హాజరు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలకు తనిఖీలకు వెళ్లినప్పుడు ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332

సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# సంస్కరణలే శరణ్యం !

దేశంలో ఎన్నికల సంస్కరణలకు ఇదే సమయం. దీనిపై ప్రస్తుత సమావేశాల్లో దీనిపై చర్చ జరగాలి. అవసరమైతే రాజ్యంగ సవరణ జరగాలి. ఒక్క దొంగ ఓట్ల గురించే చర్చ కాదు..అనేక విషయాలపై చర్చ జరగాలి. ఏకపక్షంగా కొందరే దేశాన్ని పాలించే దౌర్భాగ్య వ్యవస్థ నుంచి భారత్ బయటపడాలి. ఇందుకోసం అవసరమైన చర్చ జరగాలి. సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. ప్రధానంగా కొందరే పార్లమెంట్‌కు వరుసగా ఎన్నికయ్యే దుర్విధానం పోవాలి. అలాగే ఒక్కరు రెండుసార్ల కటే ఎక్కువగా పార్లమెంట్, అసెంబ్లీలకు ఎన్నిక కాకుండా కఠిన నిబంధనలు విధించాలి. ప్రధాని, మంత్రులుగా రెండు పర్యాయాలకంటే ఎక్కువ ఉండకుండా నిబంధనలు విధించుకోవాలి. శాసనమండళ్లతో పెద్దగా లాభం లేదు. దీనిపై చర్చ జరగాలి. వీటిని రద్దు చేసుకోవడం మంచిది. రాజకీయ వ్యవస్థల కారణంగా ప్రజలు పన్నులతో కడుతున్న డబ్బులు దుబారా అవుతున్నాయి. రాజకీయ నేతల విలాసాలకు డబ్బులు వృధా చేస్తున్నారు. అలాగే ఎంపిలు, ఎమ్మెల్యేలకు జీతభత్యాలు, పెన్షన్లు తొలగించాలి. ఒక్కొక్కరు రెండు పెన్షన్లు పొందడాన్ని తక్షణమే రద్దు చేయాలి. ఎంపిటిసిలు, జడ్పిటిసిల వ్యవస్థను రద్దు చేయాలి. వీటితో పాటు గవర్నర్ వ్యవస్థను కూడా రద్దు చేయాలి. ఇకపోతే ప్రతస్తు బీహార్ ఓట్ల సవసరణపై విపక్షాలు రచ్చ చేస్తున్నాయి. దీంతో సభాసమయం వృధా అవుతోంది. వీటికి చిత్తశుద్ధి ఉంటే ఈ అంశంపై ఏదో ఒక రూపంలో చర్చకు అవకాశం ఉంది. అలా కాకుండా సభలో లొల్లి చేసి గందరగోళం సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలి. ఇకపోతే ఓట్ల నమోదు అన్నది శాస్త్రీతయంగా ఉండాలి. ఆధార్ తరహాలో పర్మినెంట్ కార్డు నంబర్ కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. ఆధార తరహాలో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉండాలి. అడ్రస్ మార్చాలనుకున్నా సులువుగా ఆన్‌లైన్‌లో చేసుకునేలా ఉండాలి. ఓటర్లు ఎక్కడికైనా మార్పు చేసుకునే వీలుండాలి. అలాగే చనిపోయిన వారి వివరాలు గ్రామస్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసి, తొలంగించే వెసలు బాటు కలిగి ఉండాలి. లేదా ఇసికి సమాచారం ఇవ్వగలగాలి. నిజానికి ఇవన్నీ ప్రధాన సమస్యలు ఉండగా కేవలం బీహార్‌లో ఓటర్ల నవీకరణపైనే కేవలం ఆందోళన చెందడం సరికాదు. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభల్లో గత పక్షం రోజులగా బీహార్ ఓటర్ల నమోదుపై ఆందోళన కారణంగా పార్లమెంట్ ఉభయ సభలు పెద్దగా కార్యకలాపాలు సాగించలేక పోతున్నాయి. దేశంలోని 4,130కుపైగా ఉన్న అసెంబ్లీ స్థానాల్లో కర్నాటకలోని ఒక్క మహదేవపుర అసెంబ్లీ స్థానంలో చోటు చేసుకున్న ఓటర్ల జాబితా అక్రమాలను చూసిన తర్వాత..మన ఓటరు జాబితాలు తప్పుల తడకలా? లేక దొంగ ఓటర్ల పనా అన్న అనుమానాలు వచ్చి నప్పుడు పారదర్శకంగా పరిశీలించుకునే అవకాశం ఇవ్వాలి. నిజంగానే దొంగ ఓట్లు, దొంగఓట్లు వేయడం వంటివన్నీ అరికట్టాలి. ఇదంతా పటిష్ట వ్యవస్తతో మాత్రమే సాధ్యం. అవన్నీ దొంగ ఓట్లే అని ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై విచారణ జరపడంలో సందేహం ఉండాల్సిన పనిలేదు. ప్రభుత్వంతో పాటు ఎన్నికల వ్యవస్థను పర్యవేక్షిస్తున్న రాజ్యాంగబద్ధసంస్థ ఎన్నికల సంఘం కూడా ఇలాంటి వాటికిఒ జవాబుదారీగా ఉండాలి. అయితే ఇప్పుడున్న వ్యవస్థలో దొంగోట్ల నమోదు, దంగ ఓట్లు వేయించు కోవడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటర్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా సాగాలి. అలాకాకుండా దొంగ పేర్లు, దొంగ ఓట్లు నమోదు చేయడం వంటివన్నీ చూస్తున్నాం. పోలింగ్ బూతుల ఆక్రమణ, రిగ్గింగ్ వంటి దుర్మార్గాలను చూస్తున్నాం. ఇవన్నీ పోవాలంటే సమగ్ర చట్టాలు రావాలి. అందుకే సమగ్ర ఎన్నికల వ్యవస్థ లేకుండా ఇప్పుడున్న రీతిలో ముందుకు సాగలేం. దొంగ ఓట్లను నమోదు చేయించడం, వేయించడం అన్నది రాజకీయ పార్టీలు అవలంబిస్తూ వస్తున్న దుర్మార్గపు చర్యలగానే చూడాలి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకున్న రాజకీయ పార్టీలు ప్రజలు వెర్రిబాగులను చేసి అధికారం చెలాయిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణలో ఉన్న సర్వ స్వతంత్రత కలిగిన సంస్థగా ఎంత బలమైనదో టీఎన్ శేషన్ వంటి అధికారులు నిరూపించారు. 1951 మొదటి ఎన్నికల నుంచి ఇప్పటివరకూ ఎన్నో సంస్కరణలు జరిగాయి. 1989లో ఓటు హక్కును 18 ఏండ్లు నిండినవారికి ఇవ్వడం మొదలు 1990లో ఓటరు గుర్తింపు కార్డుల పరిచయం, 2009లో ఈవీఎం మిషన్ల ప్రవేశం, 2019లో వీవీ స్లిప్పులు వంటివి జరిగాయి. చీఫ్ ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లను ప్రధాని, ప్రతిపక్షనేత, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాతో కూడిన కమిటీ ఎన్నుకునేది. కానీ, మోదీ ప్రభుత్వం 2023లో సీజేఐ స్థానంలో కేబినెట్ మంత్రిని తీసుకొచ్చింది.

# పార్లమెంట్‌లో అదే రభస

## -బీహార్ వ్యవహారంపై చర్చకు పట్టు-ఉభయ సభలు వాయిదా
## -అనుమానాల నివృత్తిపై భేటీకి ఇసి సమ్మతి

**న్యూఢిల్లీ,ఆగస్ట్11(సమయజ్యోతి):**



ప్రతిపక్షాల ఆందోళలతో పార్లమెంట్ దద్దరిల్లింది. సోమవారం ఉదయం ఉభయ సభలు ప్రారంభం కాగానే బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఆందోళనకు దిగాయి. బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాల్సిందేనని పట్టుబట్టాయి. బీజేపీతో ఈసీ కుమ్మ-క్తె-÷-కందని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. స్పీకర్ సముదాయించే ప్రయత్నం చేసిన విపక్షాలు వెనక్కి తగ్గలేదు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో పార్లమెంట్ ఉభయ సభలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మరోవైపు.. ఓట్ల చోరీ జరుగుతుదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఈసీ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో ఇండియా కూటమిలోని 25 ప్రతిపక్ష పార్టీల నుంచి 300 మందికి పైగా ఎంపీలు పాల్గొననున్నారు. అయితే, ఇండియా కూటమి నేతల ర్యాలీకి ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఇండియా బ్లాక్ ఎంపీల ర్యాలీపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలావుంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లో జరుగుతున్న ఎలక్టోరల్ రోల్స్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సరిగా లేదని ఆరోపిస్తూ ఇండియా కూటమి భారీ ఆందోళనకు సిద్ధమైంది. సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ఆఫీస్ వరకు 300 మందికి పైగా ఎంపీలు ర్యాలీ చేయబోతున్నారు. అయితే, ఈ ర్యాలీకి ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ర్యాలీ నిర్వహణకు సంబంధించి తమకు ఎలాంటి అధికారిక వినతి అందలేదని సీనియర్ పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇండియా కూటమి మాత్రం ర్యాలీ నిర్వహించి తీరాలని నిర్ణయించారు. ఇలాంటి సమయంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపక్ష పార్టీ నేతలతో భేటీకి ఎన్నికల సంఘం అంగీకరించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, పార్లమెంట్ సభ్యుడు జైరాం రమేష్ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. భేటీకి అవకాశం ఇవ్వాలని కోరారు. జైరాం రమేష్ లేఖపై ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు జైరాం రమేష్‌కు ఎన్నికల సంఘం సెక్రటరీ అశ్వినీ కుమార్ మోహల్ ఆదివారం రాత్రి లేఖ రాశారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఎక్కువ మంది పట్టే అవకాశం లేనందున కేవలం 30 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. సుకుమార్ సెన్ హాల్‌లో సమావేశం జరగనుంది. అయితే, ఎన్నికల సంఘం భేటీకి అంగీకరించిన నేపథ్యంలో ర్యాలీపై ఇండియా కూటమి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. కాగా, 2024 ఎన్నికల్లో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో దాదాపు 1,00,250 ఓట్లు చోరీ అయ్యాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు.

# 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతం

## -ఎంపిల ర్యాలీకి పోలీసుల అనుమతి నిరాకరణ-ర్యాలీని అడ్డుకుని బస్సుల్లో తరలించిన పోలీసులు

**న్యూఢిల్లీ,ఆగస్ట్11(సమయజ్యోతి):**




బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని దిల్లీలో విపక్ష ఎంపీలు చేపట్టిన 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతంగా మారింది. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. బిహార్‌లో ఓట్ల జాబితా సవరణకు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు ఈ ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయల్దేరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందంటూ ఎంపీలు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ సహా దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు పాల్గొన్నారు. అయితే.. ఈ ర్యాలీకి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకపోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సంసద్ మార్గ్‌లో భారీగా పోలీసులు మోహరించారు. ఈ రహదారిని బ్లాక్ చేసి బారికేడ్లు పెట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అఖిలేశ్ యాదవ్ సహా కొంతమంది ఎంపీలు బారికేడ్లు దూకేందుకు యత్నించారు. వాటిపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని నిలువరించారు. విపక్ష ఎంపీలు అక్కడే బైఠాయించి నిరసన కొనసాగించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో అక్కడి నుంచి తరలించారు. పార్లమెంట్ భవన్ నుంచి ఈసీ ఆఫీస్‌కు మార్చ్ చేపట్టింది. విపక్ష ఎంపీలంతా ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రానికి, ఈసీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. వ్యతిరేక నినాదాలు చేశారు. అయితే అనుమతి లేదంటూ బారికేడ్ల దగ్గర పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో ఎంపీలు వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంతలో మహిళా ఎంపీలు, అఖిలేష్ యాదవ్ బారికేడ్లు దూకే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ఆశ్చర్యంలో కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టుగా ఉండే శశిథరూర్ అనూహ్యంగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. మరోవైపు, బిహార్ సమగ్ర సవరణ సర్వే సహా పలు అంశాలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఈసీకి లేఖ రాశారు. ఇందుకు అనుమతించిన కేంద్ర ఎన్నికల సంఘం.. విపక్షాలతో భేటీకి అంగీకరించింది

# ఇడి విచారణకు హాజరైన రానా

**హైదరాబాద్,ఆగస్ట్11(సమయజ్యోతి):**



బెట్టింగ్ యాప్ ప్రమోషన్ కేసులో సినీ నటుడు దగ్గుబాటి రానా సోమవారం ఇడి విచారణకు హాజరైయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రాంతీయ కార్యాలయంలో అధికారులు రానాను సుమారు నాలుగు గంటలపాటు- విచారించారు. విచారణ అనంతరం రానా మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. అయితే ఈ కేసులో రానా బ్యాంకు లావాదేవాలపై అధిరాకారులు విచిరించినట్లు- తెలుస్తోంది. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లకు తీసుకున్న పారితోషకం ఇతర వివరాలపై ఇడి అధికారులు రానాను ప్రశ్నించినట్లు- తెలిసింది. రానా తన బ్యాంకు సంబంధించిన లావాదేవీల వివరాలు అధికారులకు అందించారు. బెట్టింగ్ యాప్ కేసులో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఇడి వరుసగా నిందితులను విచారిస్తోంది. ఇప్పటికే నటు-లు ప్రకాష్ రాజ్, విజయ్ దేవరకోండ, తాజాగా రానాను విచారించగా, రేపు నటి మంచులక్ష్మిని సైతం ఇడి అధికారులు విచారించనున్నారు. ఇప్పటికే విచారణకు రావాలని మంచు లక్ష్మికి అధికారులు నోటీ-సులు జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌పై నటు-లు, టీవీ హోస్ట్‌లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు 29 మందిపై రాష్ట్రంలోని పలు చోట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుల ఆధారంగా ఇడి రంగంలోకి దిగింది.

# ఎంపిలకు మరో కొత్త నివాస సముదాయం

## కొత్త సముదాయాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్11(సమయజ్యోతి):**

ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఎంపీల నివాస సముదాయాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి మోడీ ఎంపీల ఫ్లాట్లు- ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఇకపై ఎంపీల కొత్త నివాసాల్లో ఎటువంటి సమస్యలు ఎదుర్కోరని.. పనిపై ఎక్కువ దృష్టి పెడతారని చెప్పారు. అద్దె భవనాల నుంచి పని చేసే మంత్రిత్వ శాఖల అద్దె ఏటా రూ.1,500 కోట్లు- ఖర్చు అవుతుందని చెప్పారు. అలాగే ఎంపీలకు కూడా సరైన నివాసాలు లేకపోవడంతో ప్రభుత్వ ఖర్చులు కూడా చాలా ఎక్కువగా అవుతున్నాయని వెల్లడించారు. నివాసాల కొరత ఉండడంతో 2014 నుంచి 2024 వరకు దాదాపు 350 మంది ఎంపీలకు కొత్త నివాసాలు నిర్మించినట్లు- తెలిపారు. తాజాగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనంలో 184 మందికి పైగా ఎంపీలు కలిసి నివాసం ఉండొచ్చని చెప్పారు. ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో కొత్త నివాస సముదాయాన్ని నిర్మించారు. -టైప్-÷ఎఒఒలో భాగంగా 184 ఫ్లాట్లతో బహుళ అంతస్తులతో ఈ నిర్మాణం చేపట్టారు. సోమవారం ఈ నివాసాన్ని ప్రారంభించే ముందు ప్రాంగణంలో సింధూర మొక్కను మోడీ నాటారు. అనంతరం కార్మికులతో సంభాషించారు. ప్రతీ ఫ్లాట్ చాలా విశాలంగా నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ భవనం అల్యూమినియం షట్టరింగ్‌తో కూడిన మోనోలిథిక్ కాంక్రీటును ఉపయోగించి నిర్మించారు.

# జాతీయ నులి పురుగుల దినోత్సవం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల మరియు పాఠశాల విద్యార్థులకు పోచంపాడు పిహెచ్సి వైద్యులు నాగరాజు, రాకేష్ ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్, హెచ్ఈఓ సురేష్, హెచ్ఇ మురళి, ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



# బోర్గాం(పీ)లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 11 :**

మోపాల్ మండలం బోర్గాం(పీ) గ్రామంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఆయుష్మాన్ భారత్ %-% హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్ (పల్లె దవాఖాన), శాఖా గ్రంథాలయం, సొసైటీ ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేశారు. పల్లె దవాఖానాను సందర్శించిన కలెక్టర్, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ హెల్త్ సెంటర్ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీస్తూ, రికార్డులను తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్, ఏ.ఎన్.సీ చెకప్ లు, టీ.బీ ముక్త్ భారత్ అభియాన్, ఆరోగ్య శిబిరాల నిర్వహణ తదితర సేవలను ప్రజలు సదివినియోగం చేసుకునేలా చూడాలని హితవు పలికారు. హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో చేపట్టే ఆరోగ్య శిబిరాలు, ఇతర వైద్య సేవా కార్యక్రమాల గురించి ముందస్తుగానే ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ ఎవరికైనా సీజనల్ వ్యాధులు సోకితే తగిన చికిత్సలు అందిస్తూ, ఇతరులకు సోకకుండా పరిసర ప్రాంతాలను ఫాగింగ్ జరిపించాలని అన్నారు. కాగా, హెల్త్ సెంటర్ కు నూతన భవనం మంజూరైనందున, త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం కలెక్టర్ హెల్త్ సెంటర్ పక్కనే నిర్వహిస్తున్న శాఖా గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. తాత్కాలిక భవనంలో ఇరుకిరుకు గదులలో లైబ్రరీ కొనసాగుతుండడాన్ని గమనించి, సమీపంలోనే మరో భవనంలో దీనిని మార్చాలని, పాఠకులకు అనువుగా ఉండేలా చూడాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డిని ఆదేశించారు. లైబ్రరీలో సమయ పాలన విధిగా పాటించాలని, అన్ని రకాల పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను సందర్శించి, ఎరువుల స్టాక్ పరిశీలించారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటి వరకు ఎలాంటి కొరత ఏర్పడలేదని సొసైటీ నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా, ఎరువుల స్టాక్ వివరాలతో కూడిన బోర్డును అందరికీ కనిపించేలా ఎరువుల విక్రయ కేంద్రాల బయట ప్రదర్శించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.



# బాధితుల సమస్యలను పరిష్కారించాలి : ఎస్పీ డా. జి. జానకి షర్మిల

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 11.**

జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



# నులి పురుగుల నివారణ మాత్రలు అందరికీ పంపిణీ చేయాలి: కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

## బోర్గాం(పీ) ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 11 :**

01 నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారందరికీ తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బోర్గాం(పీ) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జిల్లా అధికారులతో కలిసి పాఠశాలకు చెందిన బాలబాలికలకు నులి పురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నాలుగు లక్షల మంది 01-19 వయస్సు కలిగిన బాలబాలికలకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఏ ఒక్కరు కూడా తప్పిపోకుండా అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడిలలో పిల్లలకు ఈ మాత్రలు వేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని విద్య, వైద్యారోగ్య శాఖల అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల ఎవరైనా తప్పిపోతే, ఈ నెల 18న మలి విడతగా చేపట్టే కార్యక్రమంలో తప్పనిసరిగా వారికి ఆల్బెండజోల్ మాత్ర వేసేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం నూటికి నూరు శాతం విజయవంతమయ్యేలా వైద్య, విద్యా శాఖతో పాటు ఐసీడీఎస్, సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. నులి పురుగుల వల్ల పిల్లలలో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారని అన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతియేటా ఫిబ్రవరి, ఆగస్టు మాసాలలో రెండు పర్యాయాలు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయిస్తోందని తెలిపారు. ఈ మాత్ర వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కాగా, విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, ఆహార పదార్థాలు తినే ముందు చేతులను చక్కగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. 1009 మంది విద్యార్థిని,విద్యార్థులు కొనసాగుతున్న బోర్గాం(పీ) ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహణ గురించి ప్రజల్లో ఎంతో సదభిప్రాయం ఉందని, అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని కలెక్టర్ అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు అవసరమైన వసతులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, ఇంకనూ పెద్ద మొత్తంలో సదుపాయాలు కావాల్సి ఉన్న పక్షంలోనూ రాష్ట్ర స్థాయిలోని ఉన్నతాధికారులను సంప్రదించి సౌకర్యాల మెరుగుదలకు చొరవ చూపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలి ఆదేశించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 11 :**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని పంపించవద్దని, ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులే స్వయంగా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో జిల్లా అధికారుల హాజరును పరిశీలించేందుకు అటెండెన్స్ తీసుకోవాలని సూచించారు. సోమవారం ఐ.డీ.ఓ.సీలో అదనపు కలెక్టర్ లు అంకిత్, కిరణ్ కుమార్ లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 83 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. అయితే ప్రజావాణికి పలు శాఖల జిల్లా అధికారులు గైర్హాజర్ అయ్యారు. మరికొంత మంది తమ కింది స్థాయి అధికారులను పంపించారు. దీనిని గమనించిన కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఎంతో కీలకంగా భావించే ప్రజావాణికి జిల్లా అధికారులు గైర్హాజరు కావడం సమంజసం కాదన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ప్రజావాణిలో తప్పక ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎవరికైనా అత్యవసరమైన పని ఉంటే, ముందుగానే తమ దృష్టికి తేవాలని సూచించారు. తమ అనుమతి లేకుండా ప్రజావాణికి గైర్హాజర్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, మెప్మా పీ.డీ రాజేందర్, బోధన్ ఏ.సీ.పీ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలంలోని శ్రీ భాష్యం పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య సిబ్బంది, నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భూస రత్నాకర్ పాల్గొన్నారు.



# పాఠశాలకు 70 వేల ఫర్నిచర్ వితరణ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

వెల్లటూరు జెడ్పి ఉన్నత పాఠశాలకు సోమవారము విద్యాభిమాని ప్రముఖ పారిశ్రామికవేత్త, చిట్టాపూర్ వాస్తవ్యులు దయానంద రెడ్డి, 70 వేల విలువైన 15 డెస్కులను వితరణ చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం డెస్కులను అందజేసిన ఆ దాతను హెచ్ఎం కాసం శ్రీనివాసు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. దాత ఆశయాన్ని నెరవేర్చాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీ రవీందర్, సురేష్, శంకర్, స్వామి, రాజలింగం, మదార్ పాల్గొన్నారు.



# రైతు బీమా పథకము-2025

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్



05.6.2025 లోపు కొత్తగా భూమి పట్టా పాస్ బుక్ పొందిన రైతులు రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలని సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల వ్యవసాయ అధికారి సిఎస్ దుర్గారాజ్ ఒక ప్రకటనలో తెలిపారు . మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పట్టా పాస్ బుక్ కలిగి ఉండి ఆధార్ కార్డులో 18 నుండి 59 సం.ల మధ్య వయస్సు గల ప్రతి రైతుకి ఉచితంగా రైతు బీమా కల్పిస్తుంది. కావున కొత్తగా భూమి పట్టాదారు పాసు బుక్ వచ్చిన రైతులు నమోదు చేసుకోగలరు. గత సంవత్సరము రైతు బీమాలో నమోదుకాబడిన రైతులు ఈ మధ్యకాలములో ఆధార్ కార్డులో ఏవైనా మార్పులు చేసుకుంటే లేదా నామిని వివరములు మార్పు చేసుకోవాలనుకుంటే ఈనెల12 లోపు దరఖాస్తు సమర్పించగలరు. రైతు ఏ కారణం చేత మరణించిన రైతు బీమాలో నమోదు కాబడిన నామినికి ఐదు లక్షలు అందించబడును. రైతు బీమా ఫారముతో రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్, జిరాక్స్ లను జతపరిచి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు 13.08.2024 సాయంత్రం 5.00 గంటల లోపు రైతు స్వయంగా సంప్రదించి దరఖాస్తు ఇవ్వాలి. రైతు భీమా పథకంలో నిర్ణిత సమయంలో నమోదు కానీ రైతులకు బీమా వర్తించదు.

# ఉంద్యాల గ్రామ దేవాలయం కు యంపిల్ మైక్ సెట్ వితరణ.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి చిన్నచింత

కుంట మండలం మహబూబ్ నగర్ జిల్లా.

జి మధుసూదన్ రెడ్డి జి. ఎం. ఆర్. దేవరకద్ర ఎమ్మెల్యే నివాసం లో ఉంద్యాల గ్రామ నికి చెందిన గురు మందిరం కొరకు యంపిల్ మైక్ సెట్ కావాలి అని జి. ఎం. ఆర్ సేవ సమితి అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణమూర్తి ని అడిగిన వెంటనే స్పందించి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జి. ఎం. ఆర్ చేతుల మీదిగా మైక్ సెట్ ను ఇవ్వడం జరిగింది. ఇందుకు గాను గ్రామస్థులు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి కృష్ణమూర్తికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి బాల్యమిత్రుల ఆర్థిక సాయం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామానికి చెందిన అశోక్ అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని భార్య ముగ్గురు పిల్లలు దీన స్థితిలో ఉన్నారనే సమాచారం మేరకు స్పందించి టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మానవత దృక్పథంతో 31 వేల నగదు తోపాటు నెలకు సరిపడే నిత్యవసర సరుకులను అందజేశారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగపూర్ రామ్ రెడ్డి, పాస్టర్ రాజయ్య, రాజా గౌడ్, చీకోడు దేవయ్య, యాది మల్లేష్, సంతోష్ పాల్గొన్నారు.



# నులిపురుగుల నివారణ మాత్రలు అందజేత

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారము వైద్య సిబ్బంది, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జె.శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.



# డిబిఎల్ బీడీ కార్మికులపై భారం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

డిబిఎల్ బీడి కంపెనీ యాజమాన్యం, బీడీ కార్మికులకు బలవంతంగా 200 రూపాయల చిప్స్ ప్యాకెట్లు, 90 రూపాయల స్వీట్ ప్యాకెట్లు అంటగట్టడం సమంజసం కాదని సోమవారం నాయకులు తోట ధర్మేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న కార్మికులపై భారం పడుతుందని అన్నారు.




# భవిష్యత్ తరాలను పైలేరియా నుండి విముక్తి చేయాలి : కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

భవిష్యత్ తరాలను పైలేరియా నుండి విముక్తి చేయాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబెర్ పుష్పానగేష్ అన్నారు సోమవారం రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ మండల్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ఏర్పాటు చేసిన జాతీయ పైలేరియా నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని డాక్టర్ కల్పన తో కలిసి ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈనెల 10 నుండి 25 వరకు కొనసాగుతుందని తెలిపారు ఈ మాత్రలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని అందరు తప్పక మాత్రలను వేసుకొని పైలేరియా నిర్మూలన లో తమ వంతు పాత్రను పోషించాలని అన్నారు ప్రతి ఒక్కరూ ఈ ఉచిత మాత్రలు తప్పకుండా తీసుకోని తమ కుటుంబ సభ్యులను భవిష్యత్తరాలను పైలేరియా నుంచి విముక్తి చేయాలని కార్పొరేటర్ అకాంక్షించారు



# నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు పంపిణీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలంలోని న్యూ ఇండియా పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య సిబ్బంది, నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలత, పాఠశాల ఇంచార్జ్ మొహమ్మద్ నిహారుద్దీన్, సయ్యద్ శంషాద్దీన్ ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.






# ధ్యానం ద్వారా జ్ఞానం ప్రాప్తిస్తుంది.సద్గురు పులాజి బాబా తనయులు వామన్ దాదా ఇంగ్లే..

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్

ప్రతి నిత్యం ధ్యానం చేయడం వల్ల జ్ఞానం ప్రాప్తిస్తుందని తద్వారా మనిషి ఆధ్యాత్మిక మార్గంలో పయనించి సుఖ శాంతులను పొందగలుగుతాడని సద్గురు ఫులాజి బాబా తనయులు శ్రీ సిద్ధమహా యోగ పీఠం సిద్దేశ్వర సంస్థాన్ గౌరవాధ్యక్షులు వామన్ దాదా ఇంగ్లే అన్నారు. ఆదివారం బేల మండలం భాది గ్రామంలో జరిగిన ఆధ్యాత్మిక సత్సంగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ మనిషికి ఎన్ని ఆస్తిపాస్తులున్న అవి సుఖ సంతోషాలను సంపూర్ణంగా కలిగించలేవని ధ్యాన మార్గం ద్వారా శాంతి యుత జీవనాన్ని అలవర్చుకొని ఆత్మసాక్షాత్కారాన్ని పొంది మానవుడే మాధవుడుగా ఎదగ గలుగుతాడని అందుకే పిల్లలు, పెద్దలు, వృద్ధులు, మహిళలు అందరూ ప్రతినిత్యం ధ్యానం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫులాజి బాబా శిష్యులు తుకారం జాదవ్,( ఉట్నూరు) సుకుమార్ పెట్కులే, (ఆదిలాబాద్) శంకర్ నాగోషే (ఆసిఫాబాద్) ,సతీష్ గురువులే (సోన్ కాస్) సురేష్ గుర్నులే (బేల) మురలీధర్ నాగోషే (జునోని) నందకిషోర్ నాగోషే, సునీల్ శేండే సోన్కాస్, కమలేష్ డాంగే గడ్చందూర్ జూనోని, ఆవల్ పూర్ గడ్చాందుర్ ధ్యాన కేంద్రాల సభ్యులతోపాటు భాది గ్రామ పెద్దలు, గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పాఠశాలలో నిలిచినా వర్షం నీళ్లు......

## శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ను తొలగించండి ప్రధానోపాధ్యాయుడు గంగాధర్

సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా

గత నాలుగు, ఐదు రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గురుజాల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గదులులలో నీరు నిలిచిపోయాయి.తరగతులు నిర్వహించడం ఇబ్బందిగా మారింది అని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ సోమవారం తెలిపారు.వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్ష కాలం వస్తే చాలు పాఠశాలలోకి నీరు చేరి తరగతుల నిర్వహించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు 61మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాల భవనం నిర్మించి 50 సంవత్సరాలు పైగా అయింది. పాఠశాల భవనం పై కప్పు ఎప్పుడు కూలుతుందో తెలియదు అనే భయాందోళనలో విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్నామని అన్నారు. ఉన్న ఒక్క పాఠశాల గదిలో 1 నుండి 5 తరగతులు నిర్వహిస్తున్నామని అలాగే ఆఫీస్ రూమ్ కూడా అదే రూమ్లో పెట్టుకున్నామని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మండల విద్యాశాఖ అధికారి మరియు జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి ఇట్టి పాత బిల్డింగును కూల్చివేసి నూతన బిల్డింగ్ మంజూరు చేయుటకు అధికారులు కృషి చేయాలని అన్నారు.



# బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు శ్రావణమాసం పురస్కరించుకొని రామ చంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీ శ్రీ శ్రీ శ్రీ ఐదు గుళ్ళ పోచమ్మ తల్లి అమ్మ వారి బోనాల పండుగలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు ప్రజలందరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు అనంతరం ఆయా కాలనీలలో నిర్వహించిన ఫలహారం బండ్ల ఊరేగింపులో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుష్పానగేష్ దంపతులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్ ఐలేష్ పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు



# మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత

**సమయజ్యోతి న్యూస్ ఆగస్టు 11 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలకేంద్రానికి చెందిన బొప్పరపు అశోక్ అనే వ్యక్తి ఇటీవలే పురుగుల మందు తాగి మృతి చెందడం తో ఆయన కుటుంబానికి 2003-04 సంవత్సరం కి చెందిన పదో తరగతి చిన్న నాటి స్నేహితులు మృతుని భార్య సుచరిత కు రూపాయలు. 35వేలు సోమవారం ఆర్థిక చేయూతను అందించారు. ఈసందర్బంగా ఆమె పేరు మీద బ్యాంకు లో 35 వేలు పిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్ ను ఆమెకు అందించారు. రానున్న కాలం లో పిల్లల భవిష్యత్తు కోసం ఈ చేయూత తొడ్పాడుతుందాన్నారు. ఈ కార్యక్రమం లో బాల్య మిత్రులు కొంగర్ల గణేష్, గుంజాల లక్ష్మణ్, నరేష్, కుటుంబ సభ్యులు ఉన్నారు.



# టీఎన్జీఓ ప్లాట్ల వెంచర్ పై కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బిఎస్పి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

నస్పూర్ శివారులోని సర్వే నెంబర్ 42 లో గల టీఎన్జీఓ ప్లాట్ల లో జరుగుతున్న అవకతవకలపై జిల్లా పాలన అధికారికి వినతి పత్రం ఇచ్చిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు. అనంతరం బిఎస్పి నాయకులు మాట్లాడుతూ ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతున్నాయని గూడు కోసం గుడిసె వేసుకుంటే హుటాహుటిన తొలగించే ప్రభుత్వ అధికారులు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న టీఎన్జీఓ కాలనీలో జరుగుతున్న అవకతవకలు, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదొ చెప్పాలని అన్నారు. నస్పూర్ శివారులో ఉన్న 42 సర్వే నంబర్ లో టీఎన్జీవో ప్లాట్ల లేక రియల్ ఎస్టేట్ వెంచర్ అని సందేహం కలుగుతుందన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేనియెడల జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. మొదలు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్, జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు నాగుల కిరణ్ బాబు, నాయకులు జాడి ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# పట్టపగలే బైకు దొంగతనం

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణ పేట జిల్లా**

మండలంలోని హిందూపూర్ గ్రామంలో పట్ట పగలే బైకు దొంగతనం జరిగింది. వివరాలలోకి వెళ్ళితే హిందూపూర్ గ్రామం ఈశన్న గౌడ బైక్ నెంబర్ టీఎస్ 38,3280 హొండా షైన్ బైక్ తన ఇంటి ముందు పార్కు చేసి తాళం వేసి లోపలికి వెళ్లారు, తిరిగి వచ్చి చూసే సరికి బైక్ చోరికి కి గురైనట్లు గుర్తించారు.పట్ట పగలే దొంగతనాలు జరుగుతుండడం పై గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బైకు దొంగలపై పోలీసులు నీకు పెట్టి వారిని పట్టుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.




# డిఆర్టిఓ లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ జరిపిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుంచి అధికారి లక్ష్మణ్, మోటార్ వాహన తనిఖీ అధికారి వంశీధర్, కార్యాలయ నిర్వాహకురాలు కల్పన పాల్గొన్నారు. జిల్లా నుంచి మొత్తం 293 కేసులు రాయడం జరిగిందని, దీనికి గాను టాక్స్ మరియు పెనాల్టీ కాంపౌండింగ్ ఫీ ద్వారా మొత్తంగా 96,96,465 టాక్స్ ఫెనాల్టీ రూపేణా 151%గా వసూలు చేశామని తెలిపారు. అలాగే ఇంకా టాక్స్ కట్టని సరుకు రవాణా వాహనాలు, ట్రాక్టర్ ట్రైలర్ ఇతర వాహనాలు 5088 వాహనాలు ఉన్నట్లుగా, ఎలాంటి పెనాల్టీ లేకుండ కట్టే అవకాశం ఉందని, అదే రవాణా శాఖ అధికారులు పట్టుకుంటే 200% ఫైన్ తో కట్టాల్సి ఉంటుందని, సరుకు రవాణా వాహనాలు తప్పని సరిగా భీమా, కాలుష్య నియంత్రణ పత్రాలు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలతో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు పదిహేను సం.లు పూర్తై స్వంత పనులకు వాడే ద్విచక్ర వాహనాలు, స్వంత కార్లు విధిగా గ్రీన్ టాక్స్, వాహన భీమా, వాహన కాలుష్య పత్రాలతో మీ స్వంత వాహనాలను పురుద్దరణ చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి తెలిపారు.



# కలెక్టర్..నులి పురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వైద్యారోగ్య శాఖ అధికారి రజిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పంపిణీ చేశారు.



# ఉపాధ్యాయుల సంక్షేమమే తపస్ లక్ష్యం

## జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి నరసింహ

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ.. నారాయణ పేట జిల్లా**

నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా తపస్ పని చేస్తుందని తపస్ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి అన్నారు.సోమవారం కృష్ణ మాగనూరు మండలం పాఠశాలల్లోని సభ్యత్వ అభియాన్ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించడానికి కృష్ణ కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు.సభ్యత్వ అభియాన్ లో భాగంగా మాగనూర్, ముడుమాల్,హిందూపూర్ కృష్ణ, కోల్పూర్,గుడెబలూర్ నేరేడుగామ్, వర్కూర్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మాగనూర్, కృష్ణ మండల అధ్యక్ష కార్యదర్శులు బాబు రెడ్డి, రామ్మోహన్, నర్మద, రమేష్,గౌరవ అధ్యక్షుడు నర్సింలు మండల సహాయ కార్యదర్శి మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణా సంస్కృతి ప్రత్యేకం బోనాలు

## ఎం ఎల్ సీ అంజిరెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

బోనాలు తెలంగాణా సంస్కృతీ సాంప్రదాయానికి నిదర్శనమని కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు పటాన్చెరు నియోజకవర్గం రామచంద్రాపురం పట్టణంలో శ్రావణ మాసం బోనాల పండుగ సందర్భంగా రామచంద్రాపురం 112 డివిజన్ డివిజన్ లోని శ్రీ శ్రీ శ్రీ ఐదుగుళ్ళ పోచమ్మ తల్లి ఆలయంలో ఎం ఎల్ సీ అంజిరెడ్డి అమ్మవారిని దర్శించికొని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు దేవాలయాల అభివృద్ధి ఉత్సవాలకు తమ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు ఆయన వెంట సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి డివిజన్ అధ్యక్షులు నర్సింగ్ గౌడ్ మల్లేష్ కృష్ణమూర్తి చారి వెంకట్ రెడ్డి వైట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



# బాధిత కుటుంబానికి టెన్త్ బ్యాచ్ మిత్రుల ఆర్థిక సాయం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో పేదింటి కుటుంబ పెద్ద చీకోడు పుట్ట హరీష్ అనారోగ్యంతో మృతి చెందగా, దీనస్థితిలో ఉన్న బాధిత భార్య ఊర్మిళ, సరయు దివ్యాంగురాలు, సోనాలి, లాస్య ముగ్గురు కుమార్తెలకు, 1995 టెన్త్ బ్యాచ్ మిత్రులతో కలిసి, ఎన్నారై ఏళ్ల రాంరెడ్డి, 29 వేల ఆర్థిక సహాయం తోపాటు ఒక నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేసి, వారికి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా టెన్త్ బ్యాచ్ మిత్రులు కూర సంతోష్, చెరుకు దేవయ్య పాల్గొన్నారు.



# ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలి.- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ప్రజా సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును స్వీకరిస్తూ ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు.సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ కి,జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి నేరుగా పోలీసు ముఖ్య అధికారికి తమ సమస్యలను విన్నవించుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి ప్రజా సమస్యలకు సిబ్బందిని కేటాయించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు.ప్రజా సమస్యలను విన్నవించిన ఫిర్యాదులలో భూ సమస్యలు,ఫోర్జరీ సమస్యలు,కుటుంబ కలహాల సమస్యలు,భార్యాభర్తల మధ్య గొడవ,తండ్రి కొడుకుల సమస్యలు కేసుల పురోగతి,కేసుల దర్యాప్తు తదుపరివాటిపై సమస్యలను జిల్లా పోలీసు ముఖ్య అధికారికి నేరుగా ఫిర్యాదులను అందించి సమస్యలను విన్నవించుకున్నారు.దాదాపు 43 మంది ఫిర్యాదుదారులు జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలను తెలియజేయడం జరిగిందన్నారు.సుదూర ప్రాంతాల వారు మరియు జిల్లా ఎస్పీకి నేరుగా సమాచారం అందించాలనుకునే వారు నేరుగా వాట్సాప్ ద్వారా తమ సందేశాన్ని 8712659973 నెంబర్ కు తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సిసి కొండరాజు,ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత,సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.



# 13లోగా రైతుభీమా దరఖాస్తులు అందజేయాలి

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్**



రైతు భీమా పథకంలో చేరాడానికి ఈనెల 13 లోగా రైతులు దరఖాస్తు చేయాలని సోమవారం నిజామాబాద్ జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు వీరస్వామీ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టేదారు పాస్ బుక్కు, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు ప్రతులను దరఖాస్తు ఫారానికి జత చేసి క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు అందజేయాలని తెలిపారు. 12 లోపు నిజామాబాద్ అర్బన్ వ్యవసాయ కార్యాలయం శ్రద్ధానంద్ గంజ్ మార్కెట్ కమిటీలో సంప్రదించడం వల్ల రైతు భీమా వివరాలు సరిగ్గా నమోదవుతాయని నిజామాబాద్ అర్బన్ వ్యవసాయ అధికారి ఎస్.మహేంధర్ రెడ్డి తెలిపారు. మరింత సమాచారం కొరకు విఈఓ బి.చక్రపాణి ఫో.నెం. 897768093కు సంప్రదించాలని సూచించారు.

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి.

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## ప్రజావాణి కి 78 దరఖాస్తులు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదుల విభాగంలో వివిధ మండలాల నుండి వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్వీకరించి,సంబధిత అధికారులకు ఇస్తూ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన 78 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి,ట్రైనీ కలెక్టర్ సలోని ఛాబ్రా తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ప్రభుత్వం ఏదైనా ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందని ఎమ్మెల్యే పాయల్ అన్నారు.ఇందులో భాగంగానే షాదీ ముబారక్,కళ్యాణ లక్ష్మి పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు.ఆదిలాబాద్ లోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ టౌన్ 132, మావల 9 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన కుటుంబానికి ఆర్థిక భారం నుండి కాస్త ఉపశమనం కలిగించేందుకు ఒక లక్ష నగదు ఎంతో కొంత దోహదపడుతోందని అన్నారు.ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన చెక్కులు అందేలా అధికారులు సహకరించాలని కోరారు.పేదవారు ఆడపిల్లల పెళ్లిల్లు చేసేందుకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే షాదీ ముబారక్ చెక్కులను అందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,ఆర్డీవో స్రవంతి,అధికారులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నియంత్రణ , సైబర్ క్రైమ్ పై ఎస్సై అవగాహన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్సై శైలేందర్, విద్యార్థులకు సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, మైనర్ డ్రైవింగ్, ఈవ్ టిజింగ్, సీసీ కెమెరాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు గణేష్, సుకుమార్, విజయలక్ష్మి, శ్రీనివాస్ రాజ్, శ్రావణి పాల్గొన్నారు.




# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి వాకిటి శ్రీహరి.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**

తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన అడ్వకేట్ దివాన్జీ లక్ష్మి అశోక్ కుమార్ కుమారుని రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, సుఖసంతోషాలతో, ఆనందమయమైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు.వీరి వెంట మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చెర్మన్ ఎం. డి. రహిమతుల్లా,కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు మండల అధ్యక్షుడు రాయచూరు పరమేష్, నర్వ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, పట్టణ అధ్యక్షుడు నల్లగొండ శ్రీను,కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు తులసిరాజు యాదవ్ మాజీ సర్పంచ్ మొగిలి గంగాధర్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలకు లిఫ్ట్ ఇచ్చినందుకు బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్టు,రిమాండ్.

## వన్ టౌన్ సీఐ బి సునీల్ కుమార్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

మహిళకు లిఫ్ట్ ఇచ్చినందుకు బెదిరింపులకు గురిచేసి 30 వేల డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు సోమవారం ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలియజేశారు.సీఐ తెలిపిన వివరాల ప్రకారం బాధితుడు వేష్కర్ రవికుమార్ తండ్రి లక్ష్మణ్, ఔట్సోర్సింగ్ ఉద్యోగి,ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా,బాధితుడు తెలిపిన ప్రకారం గత నెల 21వ తారీకు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కలెక్టర్ కార్యాలయం ఆదిలాబాద్ సమీపంలో ఒక మహిళ లిఫ్టు కోరగా,తన ద్విచక్ర వాహనంలో ఎక్కించుకొని ఆమె చెప్పిన ప్రకారం జడ్జి గారి ఇంటి వద్ద గల కైలాష్ నగర్ దగ్గర దింపడం జరిగిందని ఆ మహిళ ఆతని ఫోన్ నెంబర్ తీసుకుందని,తర్వాత 23 తారీకున ఉదయం 11 గంటలకు చాకటి కిరణ్ తండ్రి భూమన్న,వయసు 34 సం.లు, నివాసం వాగాపూర్ గ్రామం,మండలం ఆదిలాబాద్ కు చెందిన వ్యక్తి తన మొబైల్ ఫోన్ నెంబర్ కు కాల్ చేసి తన మరదలికి ఫోన్లో వేధిస్తున్నావని ఆరోపిస్తూ,నీపై ధర్నా చేస్తామనీ,నీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామనీ అలా చేయకుండా ఉండాలంటే 50 వేల రూపాయలను ఇవ్వాలని, లేనియెడల అతనిపై దాడికి పాల్పడతానని అదేవిధంగా అతని పై అధికారులకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించగా భయంతో ఫిర్యాదుదారుడు తన వాహనం ను ఒక వ్యక్తి వద్ద తాకట్టు పెట్టి 30 వేల రూపాయలను తీసుకొని అదే రోజు సాయంత్రం అందజేయగా,డబ్బు తీసుకున్న చాకటి కిరణ్ అక్కడి నుండి వెళ్లిపోవడం జరిగిందని తెలిపారు.తదుపరి కుటుంబ సభ్యులైన తన తండ్రి రిటైర్డ్ ఎస్సై లక్ష్మణ్ కు తెలియజేయగా వెంటనే పోలీసు అధికారులను సంప్రదించి ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి సోమవారం రోజు నిందితుడు చాకటి కిరణ్ ను అరెస్టు చేసి,రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.బెదిరింపులకు పాల్పడే వారిపై,బెదిరించి డబ్బులు తీసుకుని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆదిలాబాద్ ఒకటవ పట్టణ సీఐ బి సునీల్ కుమార్ హెచ్చరించారు.



# మంత్రి కొండా సురేఖ ఇంటి ముట్టడి

**హనుమకొండ,ఆగస్ట్11(సమయజ్యోతి):**

హనుమకొండలోని రామ్‌నగర్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మంత్రి ఇంటిని ముట్టడించారు. వెంటనే 8 నెలల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. మంత్రి ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేయగా సుబేదారి పోలీసులు వారిని అడ్డుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

# జగదీప్ ధన్‌ఖడ్ ఆచూకీ తెలపండి

## ఆయన ఆరోగ్యంపై మాకు ఆందోళనగా ఉంది
## ఆయనతో మాట్లాడాలని అనుకున్నా సాధ్యం కాలేదు
## హోంమంత్రి అమిత్ షాకు శివసేన ఎంపి సంజయ్ రౌత్ లేఖ

**న్యూఢిల్లీ,ఆగస్ట్11(సమయజ్యోతి):**

రాజీనామా చేసిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడం ఆచూకీ చెప్పాలంటూ శివసేన నేత సంజ్రయౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. ఆయనతో సంప్రిందించాలని చూసినా ఆయన ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి వైదొలుగుతున్నట్లు- ఆయన చెప్పినప్పటికీ.. దీనిపై విపక్షాలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ తాజాగా శివసేన (యూబీటీ-) సీనియర్ నేత సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ధన్‌ఖడ్‌ను తాము ఫోన్‌లో కూడా కలవ లేకపోతున్నామని, ఆయన ఎక్కడున్నారో చెప్పాలని కోరారు. మన మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడున్నారన్న దానిపై ఎలాంటి సమాచారం లేదు. ఆయన ప్రస్తుత లొకేషన్ ఏంటి? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలపై స్పష్టత రావట్లేదు. ధన్‌ఖడ్‌తో మాట్లాడేందుకు కొంతమంది రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ఆయనను, ఆయన సిబ్బందిని సంప్రదించలేకపోతున్నాం. ఇది చాలా ఆందోళనకరం. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా? ఈ ప్రశ్నలపై దేశ ప్రజలకు సమాధానం కావాలని సంజయ్ రౌత్ తన లేఖలో ప్రశ్నించారు. ఈ లెటర్‌ను సంజయ్ రౌత్ ఆదివారం పంపించగా.. సోమవారం ఎక్స్ ఖాతాలో దీని గురించి పోస్ట్ చేశారు. ధన్‌ఖడ్ ఎక్కడున్నారో తెలుసుకునేందుకు సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయాలని అనుకుంటున్నట్లు ఎంపీ సంజయ్ రౌత్ వెల్లడించారు. సుప్రీంకోర్టుకు వెళ్లేముందు దీనిపై మీ నుంచి సమాచారం కోరడం ఉత్తమమని భావించాం. మా ఆందోళనలను అర్థం చేసుకుని మాజీ ఉపరాష్ట్రపతి ఆచూకీ చెబుతారని విశ్వసిస్తున్నాం అని శివసేన ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు. గతవారం పలువురు విపక్ష నేతలు కూడా ధన్‌ఖడ్ సమాచారం కోసం కేంద్రాన్ని ప్రశ్నించారు. జులై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ధన్‌ఖడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ రోజు ఉదయమంతా రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన.. రాత్రికల్లా అనూహ్య నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి దిగిపోతున్నట్లు- తెలిపారు.

# కాగ్ త్రైమాసిక నివేదిక ఆదాయం తగ్గడంపై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,ఆగస్ట్11(సమయజ్యోతి):**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగ్ క్వార్టర్లీ రిపోర్టుపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాగ్ త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోంది. ఆరు గ్యారెంటీ-ల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసింది. రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయి. రూ. 2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్‌లో చూపారు. మొదటి త్రైమాసికానికే రూ. 10,583 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. మూడు నెలల్లోనే రూ. 20,266 కోట్లు- అప్పుగా తీసుకున్నారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఆర్థిక రంగాన్ని ఎలా గాడిన పెడుతారో కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు చెప్పగలరా..? అని కేటీఆర్ నిలదీశారు.

# సిఎం రేవంత్ రెడ్డికి ఊరట

## ఎన్నికల కేసును కొట్టివేసిన హైకోర్టు

**హైదరాబాద్,ఆగస్టు11(సమయజ్యోతి):**



సిఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. 2019 అక్టోబర్‌లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పీఎస్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుంటే రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ- కేసు దాఖలు చేసిన పిటిషనర్ పెద్దిరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఆ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో పెద్దిరాజు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పిటిషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజుపై సీజేఐ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు క్షమాపణలు చెప్పాలని తెలిపింది. క్షమాపణ చెపుతూ దాఖలు చేసే అఫిడవిట్‌పై నిర్ణయాన్ని జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వదిలేసింది. వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని పెద్దిరాజుకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకున్నారు: ఎమ్మెల్యే

**హైదరాబాద్,ఆగస్టు11(సమయజ్యోతి):**

తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని, ఇది వాస్తవమని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అయితే ఆ హామీని అధిష్ఠానం అమలు చేయలేదని వాపోయారు. ఈ విషయంలో తనను రాష్ట్రంలోని ముఖ్య నేతలే అడ్డుకుంటూ అవమానిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇందులో వాస్తవాన్ని ప్రజలకు వివరించిన భట్టి విక్రమార్కకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని, ప్రభుత్వం అవినీతిరహిత పాలనను అందించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నానన్నారు.

# కృష్ణా పరివాహకంలో భారీ వర్షాలు

## జలకళ సంతరించుకున్న ప్రాజెక్టులు

**హైదరాబాద్,ఆగస్ట్11(సమయజ్యోతి):**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా పరీవాహక ప్రాజెక్టులు జలకళను సంతరించు కున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా వరద నీరు పెరుగుతోంది. శ్రీశైలం ఇన్‌ఫ్లో 1,99,714 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఎ÷-లో 1,00,800 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎడమగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.20 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీ-ఎంసీలకు గానూ.. ప్రస్తుతం 194.30 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద ప్రభావం పెరిగింది. దీంతో 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 1,10,483 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి, ప్రస్తుత నీటి మట్టాలు 590 అడుగులుగా ఉన్నాయి. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే స్థాయిలో నీరు నిల్వ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జలాశయాలకు భారీగా వరద నీరు చేరుకుంది. వరద చేరుకోవడంతో పలు ప్రాజెక్టల గేట్లు- తెరిచారు. నాగార్జునసాగర్, హిమాయత్ సాగర్, శ్రీరాంసాగర్, మూసీ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు, తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం జలాశయాల్లో భారీగా వరద ప్రవహిస్తోంది. ఈ జలాశయాల దగ్గర ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా ఉంది. హిమాయత్ సాగర్‌కు వరద నీరు మళ్లీ పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు హిమాయత్ సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. వరద నీరు పెరగడంతో రెండో గేట్‌ను మూడు ఫీట్ల మేర ఎత్తారు. ఇప్పటి వరకు ఒక్క గేటు- మాత్రమే అధికారులు తెరిచి నీటిని విడుదల చేశారు. హుస్సేన్ సాగర్ డేంజర్ బెల్స్ మోగిస్తుండటంతో ప్రమాదకరస్థాయిలో హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద నీరు చేరుకుంది. హుస్సేన్ సాగర్ నీటి మట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్‌కు వరద పోటెత్తుతోంది. బంజారాహిల్స్, బుల్కాపూర్, పికెట్, కూకట్‌పల్లి నాలాల నుంచి హుస్సేన్ సాగర్‌లోకి వరద వస్తోంది. తూముల ద్వారా హుస్సేన్ సాగర్ నుంచి నీటిని అధికారులు మూసీలోకి వదులుతున్నారు. దీంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను జీవహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. తిరిగి క్ష సర్వీస్ రోడ్డును అధికారులు మూసివేశారు. వరద ప్రవాహంతో రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్ వైపు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మూసీ పరీవాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# పాక్ ఆర్మీ చీఫ్ అణు ప్రేలాపనలు

## -పాక్ కుతంత్రాలను ప్రపంచం గమనిస్తోంది-తిప్పి కొట్టిన భారత విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ,ఆగస్టు11(సమయజ్యోతి):**

అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్.. అక్కడి నుంచే భారత్‌పై అణు బెదిరింపులకు పాల్పడి క్రమంలో ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ అణ్వా యుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్య బట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటే. ఇలాంటి వ్యాఖ్యలతో ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జా తీయ సమాజం అర్థం చేసుకోవాలి. పాక్ అణ్వాయుధా లపై ఎవరి నియంత్రణ ఉందో దీన్ని బట్టి స్పష్టమవుతోంది. అక్కడ సైన్యం, ఉగ్ర ముఠాలతో చేతులు కలిపింది. అమెరికా గడ్డపై మునీర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విచారకరం. అయితే, ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ భయపడదు. దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోం అని విదేశాంగ శాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వర్గాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్ మిలిటరీకి అమెరికా మద్దతిచ్చినప్పుడల్లా.. వారు తమ నిజస్వరూపాన్ని బయట పెడుతూనే ఉంటారు. పాక్‌లో ప్రజా స్వామ్యం లేదని దీన్ని బట్టి చూస్తే తెలుస్తోంది. ఆ దేశాన్ని సైన్యమే నియంత్రి స్తోంది. పాక్ వద్ద ఉన్న అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతంతో పాటు- ప్రపంచం మొత్తానికి ముప్పు ఎదురైనట్లే అని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొ న్నాయి. ఎ÷-లోరిడాలో ఓ కార్య క్రమంలో మాట్లాడిన మునీర్.. భారత్‌పై మరోసారి నోరుపారేసు కున్నారు. తమది అణ్వాయుధ సామర్థ్యం కలిగిన దేశమని, ఒకవేళ భవిష్యత్తులో న్యూఢిల్లీ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఎదురైతే.. తమతో పాటు- సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ ప్రేలాపనలు చేశారు. కాగా.. మునీర్ అమెరికా పర్యటనకు వెళ్లడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ మునీర్ అగ్రరాజ్యంలో పర్యటిస్తుండటం చర్చనీ యాంశంగా మారింది. ఇదిలావుంటే తమతో పాటు సగం ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తామంటూ తన అధికారిక పర్యటనలో ప్రకటించటం ప్రకం పనలు సృష్టిస్తోంది. విచక్షణ లేకుండా నోటికి వచ్చినట్లు- వ్యాఖ్యలు చేయటం ప్రపంచ భద్రతకు ముప్పని మునీర్ వ్యాఖ్యలను మాజీ భారత ఆర్మీ మేజర్ జనరల్ జిడి బక్షి ఖండించారు . పిచ్చెక్కిన మునీర్ అణుదాడి చేస్తామంటూ బెదిరించటాన్ని బక్షి కొట్టిపడేశారు. అలాగే సింధు నదిపై నిర్మించే డ్యామ్ మిస్సైళ్లతో కూల్చేస్తా మంటూ డప్పాలు బాదటం ఆయనను మరోసారి నవ్వులపాలు చేస్తోంది. ఇటీవల మే నెలలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ మిస్సైళ్లను భారత భద్రతా వ్యవస్థలు కూల్చేసిన విషయాన్ని మునీర్ మర్చిపోయారని అన్నారు బక్షి. సిందూర్ సమయంలో పాక్ మూడు బ్యాలెస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించగా 100 శాతం వాటిని భారత్ అడ్డుకుందని అన్నారు. అలాగే పాక్ పంపిన వెయ్యి డ్రోన్లలో 90 శాతం నిరోధించబడ్డాయని బక్షి చెప్పారు. 3వ అణు యుగంలో ఇంటిగ్రే-టె-డ్ ఆఉ వ్యవస్థల పూర్తి సామర్థం పాకిస్తాన్ వంటి చిన్న దేశాలు కలిగి ఉన్న అణ్వాయుధ స్థావరాలను మట్టికరిపిస్తాయని అన్నారు బక్షి. ఈ పిచ్చి ముల్లా సగం ప్రపంచాన్ని తనతో తీసుకెళ్లకుండా అమెరికా నిరోధించాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ జనరల్ బక్షి పిలుపునిచ్చారు. మునీర్ ప్రసంగం కాశ్మీర్ పై పెరుగుతున్న శత్రుత్వానికి అద్దం పడుతోంది. ఇంత నిర్లక్ష్యంగా ఒక దేశ ఆర్మీ చీఫ్ మాట్లాడటాన్ని భారత్ కూడా ఖండిస్తోంది. విదేశాలను బెదిరించటానికి పాక్ ఎప్పుడు పాత న్యూక్లియర్ దాడి పాడటాన్ని ప్రపంచ నేతలు కూడా తప్పుపడుతున్నారు. ఇదంతా చూస్తుంటే మునీర్ అమెరికా పర్యటనను మీడియా కవరేజ్ కోసం కారుకూతలు కూస్తున్నాడా అనే అనుమానాలను కూడా కొందరు సోషల్ మీడియాలో పంచుకుంటు-న్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికే ముఖ్యం

## -మేడిగడ్డ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు-స్పీకర్ పరిధిలో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

## -మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**కరీంనగర్,ఆగస్టు11(సమయజ్యోతి):**

మేడిగడ్డ ప్రాజెక్ట్ లాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటు న్నామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగా ముందుకెళ్తామని తెలిపారు. మేడిగడ్డ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్ దర్యాప్తు చేస్తోందన్నారు. ఈ కేసులో ఎవరెవరిని విచారణకి పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం లేదని స్పష్టత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌పై అధికారులే విచారణ చేస్తున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌తో లోపాయికారిగా ఒప్పందం చేసుకుందని విమర్శించారు. తమ మేనిఫేస్టో లోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జ్యూడీషనల్ ఎంక్వైరీ వేస్తామని చెప్పామని.. అన్నట్లుగానే వేశామని గుర్తుచేశారు. సోమవారంమంత్రి శ్రీధర్ బాబు కరీంనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పుకొచ్చారు. జంతర్ మంతర్ వద్ద తమ నిరసన ధర్నాకు బీజేపీ ఎంపీలు ఎందుకు మద్దతు పలకలేదని ప్రశ్నించారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడితే జనం నమ్ముతారా అని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు ఎవరినీ పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణయిస్తారని వెల్లడించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తుది నిర్ణయం స్పీకర్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు బీసీ బిల్లులను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్షకు బీజేపీ ఎందుకు మద్దతు తెలపలేదు..? ఆ పార్టీ ఎంపీలు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. అలాంటిది ఈరోజు బీసీల గురించి ప్రతిపక్షాలు మాట్లాడితే నమ్ముతారా అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లతోనే ముందుకు పోతామని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో మరోమారు భారీ వర్షం

## -అప్రమత్తం అయిన సహాయక బృందాలు-అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

**హైదరాబాద్,ఆగస్ట్11(సమయజ్యోతి):**

హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురుసింది. సాయంత్ర నల్లని మేఘావృతం ఆవరించింది నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం దంచికొటటింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, మూసాపేట్‌లో భారీ వర్షం పడుతుంది. కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, ఉప్పల్‌లో మోస్తారు వర్షం కురిసినట్లు- సమాచారం. వర్షాలతో ఎక్కడికక్కడ మెట్రో స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. రహదారులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో మాన్సూన్ బృందాలు అప్రమత్తమయ్యాయి. ప్రజలు బయటకు రావద్దని మరోమారు హెచ్చరికలు చేశారు. వచ్చే నాలుగైదు రోజులు భారీ అతి భారీ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశమున్న క్రమంలో జిల్లా యంత్రాంగంతో పాటు హైదరాబాద్ అధికారులను అలర్ట్ చేసింది వాతావరణ శాఖ. భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది వాతావరణ శాఖ.అక్కడక్కడ భారీ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వర్షాలు కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్ళద్దని సూచించింది.ఇప్పటికే జిహెచ్ఎంసి హైడ్రా మాన్సూన్ డిఆర్ఎఫ్, పోలీస్, ట్రాఫిక్ కి ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ. ముప్పు ప్రాంతాలు, లోతట్టు- ప్రాంతాలు, మూసి పరవాహక ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించింది. రానున్న నాలుగైదు రోజులపాటు- హైదరాబాద్ తో పాటు- తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరిత ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయని.. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని... దీంతో 13వ తేదీ నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 13, 14 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. 14వ తేదీ ఒకటి రెండు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది ఐఎండీ. ఇదిలా ఉండగా.. ఇవాళ భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. మిగతా అన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది ఐఎండీ. ఈ క్రమంలో మంగళవారం 12 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. 13, 14 తేదీల్లో హైదరాబాద్ లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# ఉచిత బస్సు ప్రయాణానికి సన్నాహాలు

## -మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

## -ఐటి కార్డు చూపి నిర్దేశిత బస్సుల్లో ప్రయాణం-ఆగస్టు 15 నుంచి ప్రాంభం కానున్న పథకం

**అమరావతి,ఆగస్టు11(సమయజ్యోతి):**

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏపీ వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.ఒక్కో హామీని అమలు చేస్తూ వస్తున్న కూటమి సర్కార్ ఇప్పుడు కీలకమైన పథకానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమైంది.. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఈ నెల 15వ తేదీ నుంచి ఉచిత ఆర్టీసీ ప్రయాణం అందుబాటు-లోకి రానుంది... ఇక, స్త్రీ శక్తి స్కీమ్ ఆగస్టు 15 నుంచి ప్రారంభంపై ఉత్తర్వులు జారీ చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రం అంతా మహిళలు ఉచితంగా ప్రయాణం చెయ్యచ్చు. పల్లె వెలుగు. అల్ట్రా పల్లె వెలుగు... సిటీ- ఆర్డినరీ.. మెట్రో.. ఎక్స్ ప్రెస్‌లో ప్రయాణం చెయ్యచ్చు. ఆంధ్రప్రదేశ్ నివాసులైన మహిళలు, ట్రాన్స్ జెండర్‌లు - ఐడీ ప్రూఫ్‌తో ఉచిత ప్రయాణానికి అర్హులు.. నాన్‌స్టాప్, ఇంటర్‌స్టేట్, చార్టర్డ్, ప్యాకేజ్ టూర్ బస్సులకు ఈ స్కీమ వర్తించదు.. సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, అన్ని ఏసీ బస్సులకు ఈ స్కీమ్ నుంచి మినహాయింపు ఇచ్చారు.. స్త్రీ శక్తి' పేరిట ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. 5 కేటగిరీ బస్సుల్లో ఈ సౌకర్యాన్ని అందించబోతున్నట్లు- ప్రభుత్వం వెల్లడించింది. బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు తగిన గుర్తింపు కార్డు చూపించి ఉచిత ప్రయాణం చేయొచ్చు.తిరుమల-తిరుపతి మధ్య తిరిగే సప్తగిరి బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. నాన్ స్టాప్, ఇతర రాష్ట్రాల మధ్య తిరిగే అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్, ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, ఏసీ బస్సులకు పథకం వర్తించదు. బస్సుల్లో రద్దీ పెరగనున్న దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని బస్సుల్లో సీసీ కెమెరాలు, కండక్టర్లకు బాడీ ఓర్న్ కెమెరాలు ఏర్పాటు- చేయాలని ఆదేశించింది. బస్టాండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీని ఆదేశిస్తూ.. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. ఇక, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ.. మహిళా కండక్టర్లకు బాడీ వార్న్ కెమెరాలు, అన్ని బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు- చేయనున్నారు.. బస్ స్టేషన్లలో ఫ్యాన్లు, కుర్చీలు, తాగునీరు, టాయిలెట్ సదుపాయాల మెరుగుదలపై ఆదేశాలు ఇచ్చింది ఏపీ ప్రభుత్వం.. అర్హులైన ప్రయాణికులకు జీరో ఫేర్ టికెట్లు- జారీ చేయనుండగా.. ఆ ఖర్చును ఆర్టీసికి ప్రభుత్వం రీయింబర్స్ చేయనుంది ... రాష్ట్రంలో ఎక్కడ నుండి ఎక్కడి కైనా మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.. రాష్ట్రం వ్యాప్తంగా 8,459 బస్సులను మహిళలకు ఉచిత ప్రయాణం పథకం కోసం కేటాయించారు. ఏడాదికి ఈ పథకం అమలు వలన కోసం రూ.1,950 కోట్లు- కేటాయించ నుంది ప్రభుత్వం.. ఇక, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు చూపించి ఉచిత బస్సులో మహిళలు ప్రయాణం చేయవచ్చు.. కేబినెట్ భేటీలో ఈ పథకం అమలుపై చర్చించి.. అమోదం తెలిపారు.. అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు- మొదలు అయ్యాయి.. జీరో ఫేర్ టికెట్ మహిళలకు ఇస్తారు.. గుర్తింపు కార్డు మాత్రం ప్రయాణ సమయంలో చూపించాలి.. ఆధార్ కార్డు.. ఓటర్ ఐడీ.. రేషన్ కార్డు.. పాన్ కార్డు కొన్ని గుర్తింపు పొందిన కార్డుల్లో ఏదో ఒకటి చూపించాల్సి ఉంటు-ందని స్పష్టం చేశారు.. ఈ పథకం అమలు కోసం మొత్తం ఏపీఎస్ ఆర్టీసీకి 11,500 బస్సులు ఉండగా.. 8,459 బస్సులను మహిళల ఉచిత బస్సు పథకం కోసం కేటాయించింది.. మహిళలకు, చదువుకునే మహిళా విద్యార్థినులకు బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఎంతో ప్రయోజనం పొందనున్నారు.. ఈ ఏడాదికి ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి 1,950 కోట్లు- నిధులు ఖర్చు చేయనుంది.. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం కొత్తగా 700 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేసింది.. వచ్చే రెండేళ్లలో మరో 1400 బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించింది.. అలాగే అవసరమైన సిబ్బందిపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది ఏపీ ప్రభుత్వం. ఇప్పటి వరకు పథకానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు- చేస్తూ వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణంపై ఉత్తర్వులు జారీ చేసింది..

# రాష్ట్రానికి భారీ వర్ష సూచన

## పిడుగులతో కూడిన వర్షం పడే ఛాన్స్

**అమరావతి,ఆగస్ట్11(సమయజ్యోతి):**

ప్రస్తుతం దక్షిణ కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ కారణంగా సోమవారం, మంగళవారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పిడుగులతో పాటు- తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు- అధికారులు తెలిపారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, పాత హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల దగ్గర ప్రజలెవ్వరూ నిలబడకూడదని ప్రజలకు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్న కారణంగా రైతులు పొలాల్లో పనులు చేసే సమయంలో, పశువులను మేపే వేళలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. తాజా వాతావరణ అంచనాల ప్రకారం ... బుధవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో దక్షిణ కోస్తాంధ్రలో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- సూచించింది. అల్పపీడనం బలపడితే గాలుల వేగం పెరిగి, సముద్రం ఆందోళనకర స్థితిలోకి మారవచ్చని హెచ్చరిక జారీ చేసింది. ఈ నేపథ్యంలో తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సలహా ఇచ్చింది. ఈ వర్షాల ప్రభావం ముఖ్యంగా నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, బాపట్ల, తెనాలి, ఒంగోలు, విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది.మరోవైపు.. నంద్యాల జిల్లాలోని మిద్దూర్‌లో భారీ వర్షం కురిసింది. ఉధృతంగా వాగు ప్రవహిస్తోంది. నందికొట్కూరు నుంచి నంద్యాలకు మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీశైలం జలాశయానికి భారీ వరద కొనసాగుతోంది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# వాతావరణ శాఖ హెచ్చరికలు

## అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత

**అమరావతి,ఆగస్ట్11(సమయజ్యోతి):**

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ... సోమవారం ఉదయం జిల్లాల కలెక్టర్లు, విపత్తు నిర్వహణశాఖ అధికారులతో హోం మంత్రి అనిత సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువగా నష్టం జరగనున్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాదకర హాట్‌స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు- చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తాజా పరిస్థితులపై తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని అధికారులను మంత్రి అనిత కోరారు. అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువగా నష్టం జరగనున్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.



# పెద్దమనసు చాటుకున్న మంత్రి పెమ్మసాని

## వృద్ధుడిని సొంత వాహనంలో ఆస్పత్రికి తరలింపు

**గుంటూరు,ఆగస్టు11(సమయజ్యోతి):**

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదానికి గురై అచేతనంగా పడి ఉన్న వృద్ధుడిని తన కాన్వాయ్‌లోని వాహనంలో ఆస్పత్రికి తరలించారు. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు మీదుగా పెమ్మసాని కాన్వాయ్ మంగళగిరి వైపు వెళ్తుండగా.. రోడ్డు పక్కన అచేతనంగా పడి ఉన్న వృద్ధుడిని గుర్తించారు. వెంటనే కారు దిగి ప్రాణాపాయస్థితిలో ఉన్న వృద్ధుడి వద్దకు వెళ్లారు. ఘటన వివరాలను స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. చిన్న వడ్లపూడికి చెందిన యేళ్ల వెంకటేశ్వరరావు అనే వృద్ధుడు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఓ లారీ ఢీకొట్టడంతో ఆయన చేయికి తీవ్ర గాయమైంది. గాయపడ్డ వృద్ధుడి చేతికి పెమ్మసాని కట్టు- కట్టారు. అనంతరం కాన్వాయ్‌లోని వాహనంలో ఆ వృద్ధుడిని చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఆస్పత్రికి తరలించారు.

# బాబుకు కరెంట్ షాక్ ఖాయం

## స్మార్ట్ మీటర్లపై నారాయణ విమర్శలు

**తిరుపతి,ఆగస్టు11(సమయజ్యోతి):**

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చిన చంద్రబాబుకు గట్టి షాక్ తగిలింది.. ఆ తర్వాత ఆయన ఓటమి పాలయ్యారు.. అయితే, మరోసారి చంద్రబాబుకు కరెంట్ షాక్ కొట్టడం ఖాయం అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్యానించారు.. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. విద్యుత్ మీటర్ల పై ఫైర్ అయ్యారు.. డబుల్ ఇంజన్ గవర్నమెంట్ వచ్చినా పాత వైసీపీ ప్రభుత్వం విధానాలే అవలంభిస్తుందని విమర్శించారు.. స్మార్ట్ మీటర్లు బిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేయడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోంది.. అదానీ కంపెనీతో పాటు-గా మరో మూడు కంపెనీలకు దేశ వ్యాప్తంగా విద్యుత్ సంస్థను అప్పగించారు .. స్మార్ట్ మీటర్లు.. ప్రజల మెడకు ఉరితాడు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 63 కేవీ 1 లక్ష 6 వేలకు విక్రయించాల్సి ఉంటే.. ఆ కంపెనీ 2 లక్షలకు విక్రయిస్తుందని దుయ్యబట్టారు నారాయ.. ఇలా ప్రతి వాటిపై భారీగా రేట్లు- పెట్టి రైతులపై పెను భారం మోపుతున్నారని మండిపడ్డారు.. విద్యుత్ సంస్కరణలు తెస్తే ఒకసారి చంద్రబాబుకు షాక్ తగిలింది.. మళ్లీ ఇప్పుడు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడు.. మళ్లీ చంద్రబాబుకు కరెంటు- షాక్ కొట్టడం ఖాయం అని హెచ్చరించారు.

# అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి...

## జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ.

**విజయవాడ,ఆగస్ట్11(సమయజ్యోతి):**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి అందిన ఆర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్-ఎల్ఏ రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కర వేదికకు వచ్చే వినతులను అధికారులు ఎప్పటికప్పుడు లాగిన్‌లో పరిశీలించి పరిష్కరించాలన్నారు. రీఓపెన్ కేసులను కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని, గడువులోగా వినతులకు సమాదానాలు పంపాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. ంవెన్యూ శాఖకు సంబంధించి 36, పోలీస్ 20, డిఇఓ 16 విఎంసి 9, సర్వే 7 ఏపిసిపిడిసిఎల్ 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు 4, విభిన్నప్రతిభావంతులు 3, డిఎంహెచ్‌వో 3, డిఆర్‌డిఏ 3, పౌరసరఫరాలు 2, ఎంపిడిఓ 2, ఆర్ఐవో (ఇంటర్‌మీడియట్) 2, పశు సంవర్ధక, ఏపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ , డిసిహెచ్ఎస్, డిసివో (సహకార శాఖ), జిల్లా జలవనరులు, ఎక్సైజ్ పోలీసు, మత్స్య, అటవీ, జిజిహెచ్, హౌసింగ్, పరిశ్రమలు, మైనారిటి, ఆర్అండ్‌బి, సోషల్ వెల్ఫేర్ కు సంబంధించి ఒక్కొక్క అర్జీతో కలిపి మొత్తం 126 అర్జీలు స్వీకరించడం జరిగింది. ఇందులో 54 అర్జీలు స్వయంగాను 72 అర్జీలు అన్‌లైన్ ద్వారా స్వీకరించిన్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు.

# తొలిసారిగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు

## జగన్ తదితరుల అహంకారంపై ప్రజల తిరుగుబాటు

## పులివెందుల జడ్‌పిటిసిపై హోంమంత్రి అనిత వ్యాఖ్య

**అమరావతి,ఆగస్ట్11(సమయజ్యోతి):**

జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్ జగన్ ఇలాకా పులివెందులలోని ప్రజలు తొలిసారిగా ప్రజాస్వామ్యం రుచి చూస్తున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. తొలిసారిగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయబోతున్నారని అన్నారు. సోమవారం అమరావతి లో మంత్రి వంగలపూడి అనిత విలేకర్లతో మాట్లాడతూ.. పులివెందుల తమ అడ్డా అని జబ్బలు చరుచు కున్నవాళ్ళు ఇప్పుడు ప్రజాస్వామ్యానికి భయపడుతున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అండ్ కో ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పులివెందులలో ఓటమి భయం పట్టుకున్నందుకే వైఎస్ జగన్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.వైఎస్ జగన్‌కు విలువలంటే తెలియదని.. అలాంటి ఆయన విలువల గురించి మాట్లాడడం సిగ్గుచేటు- అని చెప్పారు. పులివెందుల, ఒంటిమిట్టల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరుగుతుండటం చూసి ప్రజలు సైతం ఆశ్చర్యపోతున్నారన్నారు. బలవంతపు ఏకగ్రీవాలు చేసుకునే స్థాయి నుంచి 11 మంది అభ్యర్థులు స్థానిక జెడ్పీటీసీ ఎన్నిక బరిలో ఉండటం ప్రజాస్వామ్యానికి నిదర్శనమన్నారు. పోలింగ్ బూత్ మార్చే అధికారం ముఖ్యమంత్రికి ఉంటుందా? అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జరిగిన పక్రియపై వైసీపీ నిందలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధికి, ఎన్నికల సంఘం అధికారాలపై ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్‌కు కనీస అవగాహన లేక పోవడం దురదృష్టకరమని ఆమె వ్యాఖ్యానించారు. నెలలో 20 రోజులు బెంగుళూరులో ఉంటూ గంజాయ్, బ్లేడ్ బ్యాచ్‌లను కలిసేందుకు వచ్చే జగన్‌కు వాస్తవ పరిస్థితులు ఏం తెలుసు? అని ఆమె ప్రశ్నించారు. జగన్ హయాంలో జరిగినట్లు- ఎక్కడైనా నామినేషన్లు ఎవరైనా లాక్కున్నారా?.. తిరుపతి ఉప ఎన్నికలో దొంగ ఓట్లు- చేర్చినట్లు- పులివెందుల జెడ్పీటీ-సీ ఉపఎన్నికలో ఎక్కడైనా చేర్చారా? అంటూ మంత్రి వంగలపూడి అనిత వ్యంగ్యంగా అన్నారు. తల్లి, చెల్లికి ఆస్తి పంచకుండా కోర్టులో కేసు వేసిన వాడిని ఎలా నమ్మాలనే ఆలోచనలో పులివెందుల ప్రజలు ఉన్నారంటూ వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా ఆమె చరకలంటించారు. పులివెందుల, ఒంటిమిట్ట ప్రాంతాల్లోని ప్రజలు.. ఈ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు- వేసేందుకు భద్రతా చర్యలు చేపట్టామని వివరించారు. అయితే మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరపున వైఎస్ సునీతకు కావాల్సిన సాయం అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఆమె తండ్రిని కిరాతకంగా సొంత మనుషులే చంపారన్న వైఎస్ సునీత బాధను అంతా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# తిరుమలలో రాజకీయ ప్రసంగం

## మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిపై కేసు

**తిరుమల,ఆగస్ట్11(సమయజ్యోతి):**

మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిపై పోలీస్ కేసు నమోదయ్యింది. తిరుమలలో టీటీడీ నిబంధనలను ఉల్లంఘించి జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి రాజకీయ ప్రసంగం చేశారు. టీటీడీ విజిలేన్స్ ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం తిరుమల శ్రీవారిని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పలు రాజకీయ ఆరోపణలు చేశారు. ఆయన చేసిన రాజకీయ ఆరోపణల వీడియోలు.. మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో తిరుమలలో ఆయన ఇలా చేయడం ఏమిటంటూ రవీంద్రనాథ్ రెడ్డి వ్యవహార శైలిని పలువురు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ వెల్లువెత్తుతోంది. అదీకాక రవీంద్రనాథ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారులు పరిశీలించారు. అనంతరం విజిలెన్స్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.తిరుమల అంటేనే పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రం. ఈ క్షేత్రంలో.. అది కూడా ఆ దేవదేవుడు శ్రీవేంకటేశ్వర స్వామి వారు కొలువైన ఆనంద నిలయం వెలుపల రాజకీయాలు, రీల్స్ వంటివి చేయవద్దంటూ తిరుమల తిరుపతి దేవస్థానం ఇప్పటికే కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరించిన సంగతి తెలిసిందే.

# పెద్ద నిర్మాతలతో పోలిస్తే మాకు కష్టాలు ఎక్కువే

## మీడియా సమావేశంలో చిన్న నిర్మాత ఆవేదన

**హైదరాబాద్,ఆగస్టు11(సమయజ్యోతి):**

పెద్ద నిర్మాతలతో పోలిస్తే చిన్న నిర్మాతల కష్టాలు వేరని ప్రొడ్యూసర్ ఎస్కేఎన్ పేర్కొన్నారు. ఓ ప్రాతిపదికన కాకుండా అందరికీ వేతనం పెంచడంపై అభిప్రాయం వ్యక్తం చేశారు. సినీ కార్మికులకు 30 శాతం వేతనం పెంపు డిమాండ్‌పై టాలీవుడ్‌లో కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పలువురు చిన్న నిర్మాతలు మీడియా సమావేశంలో పాల్గొని, తమ కష్టాలు వివరించారు. వంశీ నందిపాటి, బెన్నీ, అనురాగ్, చైతన్య, రాజేశ్ దండా, మధుర శ్రీధర్, శరత్ చంద్ర, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు ఎస్కేఎన్ మాట్లాడుతూ.. సినీ కార్మికులు 30 శాతం వేతనం పెంపు కోరుతున్నారు. మరి, థియేటర్లకు ప్రేక్షకులను ఎవరు రప్పిస్తారు? మా సినిమా బడ్జెట్లకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? అలా చేస్తే 30 శాతం, 40 శాతం కాదు 50 శాతం పెంచుతాం. ఆర్థికంగా నిర్మాతలకు చాలా సమస్యలుంటాయి. 2022లో.. ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఒప్పందం మేరకు.. 25 శాతం తగ్గించి ఇవ్వమని చిన్న నిర్మాతలకు ఫెడరేషన్ చెప్పింది. కానీ, ఆ రూల్‌ను యూనియన్లు పాటించట్లేదు. ప్రస్తుతం సినీ వ్యాపారం బాగోలేదు. ఓ ప్రాతిపదికన కాకుండా అందరికీ వేతనం పెంచి ఇవ్వాలంటే కష్టం. మేం పాన్ ఇండియా స్థాయి సినిమాలు నిర్మించడం లేదు. టికెట్ ధరల పెంపులాంటివి చిన్న నిర్మాతలకు వర్తించవు. మా కష్టాలు వేరని ఆవేదన వ్యక్తం చేశారు.

# గర్భిణిని మోసుకెళ్లిన భర్తమార్గ మధ్యంలోనే ప్రసవం

**సంగారెడ్డి,ఆగస్టు11(సమయజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా నాగలగిద్ద మండలం మున్యా నాయక్ తండాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. తండాకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో గర్భిణి ఆసుపత్రికి నడుచుకుంటూ వెళుతూ.. మార్గమధ్యలో ప్రసవించింది. మున్యా తండాకు చెందిన కౌశిబాయి అనే మహిళ పురిటి నొప్పులతో ఇబ్బంది పడింది. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. తండా వరకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలోనే అంబులెన్స్‌ను నిలిపేశారు. ఆ పరిస్థితుల్లో ఆశా వర్కర్, కుటుంబ సభ్యుల సహాయంతో కౌశిబాయి భర్త ఆమెను తన భుజంపై మోస్తూ అంబులెన్స్ వరకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఏళ్ల తరబడి భారత్ మెరుగ్గా రాణిస్తున్నా

భారత మహిళల జట్టుకు తొలిసారిగా వన్డే ప్రపంచ కప్ గెలిచేందుకు సువర్ణావకాశం లభించింది. మహిళల వన్డే క్రికెట్ వరల్డ్ కప్ 2025కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. సొంత గడ్డపై జరగనున్న ఈ టోర్నమెంట్‌లో తొలిసారి ఐసీసీ టైటిల్ సాధించాలని భారత మహిళా క్రికెట్ జట్టు కలలు కంటోంది. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అభిమానులకు ఒక మెసేజ్ ఇచ్చారు. ఈసారి కప్ కచ్చితంగా కొడతామని దేశప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఆ కలను నిజం చేస్తామని ఆమె చెప్పారు. మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో జరగనుంది. ఈ టోర్నమెంట్‌కు సంబంధించి 50 రోజుల కౌంట్‌డౌన్ ప్రారంభోత్సవంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడారు. "సొంత ప్రేక్షకుల ముందు ఆడడం ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. ఈసారి మా జట్టు కప్ గెలవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంది. భారత అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆ కలను నిజం చేస్తాం" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ కౌర్, మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తన స్ఫూర్తి అని చెప్పారు. "వరల్డ్ కప్ టోర్నమెంట్‌లు ఎప్పుడూ ప్రత్యేకమే. అలాంటి సందర్భాల్లో మన దేశం పేరు నిలబెట్టడానికి నేను ప్రయత్నిస్తాను. నేను యువరాజ్ సింగ్‌ను చూసి ఇన్ స్పైర్ అయ్యాను" అని ఆమె అన్నారు. వరల్డ్ కప్‌కు ముందు భారత్, ఆస్ట్రేలియాతో మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌ను హర్మన్‌ప్రీత్ కౌర్ వరల్డ్ కప్‌కు ఒక మంచి సన్నాహంగా అభివర్ణించారు. "ఆస్ట్రేలియాతో ఆడటం ఎప్పుడూ ఒక పెద్ద సవాలే. ఈ సిరీస్ మా సన్నాహాలు ఎంతవరకు ఉన్నాయో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. మేము చాలా గట్టిగా ప్రాక్టీస్ చేశాం, మా మంచి ప్రదర్శన దాని ఫలితమే" అని ఆమె పేర్కొన్నారు. ఈ వరల్డ్ కప్ టోర్నమెంట్ రౌండ్-రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది. ఇందులో మొత్తం 8 జట్లు పాల్గొంటాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు ఇతర జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టోర్నమెంట్ తొలి మ్యాచ్ సెప్టెంబర్ 30న భారత్, శ్రీలంక మధ్య జరగనుంది.

# కోహ్లీ, రోహిత్ వన్డేలకు వీడ్కోలు పలుకుతారా?

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియా టూర్ తర్వాత రిటైర్ అవుతారా? ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానులు నోట వినిపిస్తున్న మాట ఇది. అక్టోబర్ నెలలో ఆస్ట్రేలియాతో జరిగే 3 ODI మ్యాచ్‌ల సిరీస్ తరువాత కోహ్లీ, రోహిత్ రిటైర్ అవుతారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. దేశ వ్యాప్తంగా ఓ రిపోర్ట్ ప్రకారం కోహ్లీ, రోహిత్ శర్మ ఇదే ఏడాది వన్డేల నుంచి సైతం రిటైర్ కానున్నారు. వన్డే ప్రపంచ కప్ వరకు సైతం వారు కొనసాగరు. ఈ మొత్తం వ్యవహారంపై %దీజజ×% స్పందించింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ODI రిటైర్మెంట్ ఊహాగానాలు అంతర్జాతీయంగా వైరల్ అవుతున్నాయి. ఇద్దరు సీనియర్ క్రికెటర్లు ఆస్ట్రేలియా పర్యటన తర్వాత వన్డేలకు కూడా గుడ్ బై చెప్పవచ్చునని దైనిక్ జాగరణ్ నివేదికలో పేర్కొంది. ఇక అది మొదలుకుని గడిచిన 24 గంటల్లో ఈ అంశం హాట్ టాపిక్ అయింది. వీరిద్దరూ ఇప్పటికే %ు%20, టెస్ట్ ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేల్లో కొనసాగుతున్నారు. కోహ్లీ, రోహిత్ శర్మలు భారత %ాణ×% జట్టు సెలక్షన్‌కు అందుబాటులో ఉండాలనుకుంటే, దేశవాళీ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడాల్సి ఉంటుందని నివేదిక పేర్కొంది. న్యూస్ ఏజెన్సీ %ఱు×% ప్రకారం, %దీజజ×% మేనేజ్‌మెంట్ ప్రస్తుతం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదు. ప్రస్తుతం బీసీసీఐ దృష్టి సెప్టెంబర్‌లో జరిగే ఆసియా కప్ 2025, వచ్చే ఏడాది జరగనున్న %ు%20 ప్రపంచ కప్ నెగ్గడంపై ఉంది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుకు కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్ పెద్ద ఆందోళన కలిగించే విషయం కాదు. '%దీజజ×% ఎప్పుడూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోదు. ముఖ్యంగా రిటైర్ అయ్యే ఆటగాళ్ళు చాలా ఫేమస్ అయినప్పుడు, దేశానికి ఎంతో సేవ చేసిన వారు అయినప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తుంది. అక్టోబర్ 25న సిడ్నీలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లకు రిటైర్మెంట్ మ్యాచ్ ఆఫర్ ఇచ్చారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. ఆటగాళ్లు రిటైర్మెంట్ కావడం, కొత్త ఆటగాళ్లకు అవకాశాలు రావడం నిరంతరం జరిగే ప్రక్రియ. ఏ ఆటగాడు అయినా దేశానికి విజయాలు అందించాలనే లక్ష్యంతో జట్టులో కొనసాగుతారు.' రోహిత్, కోహ్లీ వన్డేలకు రిటైర్మెంట్ వార్తలపై బీసీసీఐ ప్రకారం.. "రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ తీసుకోవాలనుకుంటే, వారు టీ20, టెస్ట్ రిటైర్మెంట్ తీసుకునే ముందు చేసినట్లుగానే %దీజజ×%కి సమాచారం ఇస్తారు. కానీ బోర్డు ప్రస్తుతం వచ్చే ఏడాది జరగనున్న %ు%20 ప్రపంచ కప్, ఈ సెప్టెంబర్‌లో జరనున్న ఆసియా కప్‌లో విజేతగా నిలవడంపై ఫోకస్ చేసింది. బీసీసీఐ ఏ ఆటగాడిని రిటైర్ కావాలని సూచించదు. అది ఆటగాళ్ల వ్యక్తిగత నిర్ణయమే. ప్లేయర్ల ప్రదర్శణ ఆధారంగా ఆటగాళ్లు జట్టులో స్థానం దక్కించుకుంటారు" అని బీసీసీఐ పేర్కొన్నట్లు సమాచారం. అయితే టీమిండియాలో ఆడని సమయంలో ఆటగాళ్లు డొమెస్టిక్ మ్యాచ్‌లు ఆడుతూ ఉండాలని గతంలో బీసీసీఐ చేసిన వ్యాఖ్యలు వీరు పాటించాలా, లేదా అనే దానిపై మాత్రం బోర్డు స్పందించలేదు.






# బట్లర్ ఇంట్లో తీవ్ర విషాదం

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తండ్రి జాన్ బట్లర్ కన్నుమూశారు. ఈ విషయాన్ని జోస్ బట్లర్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్వయంగా వెల్లడించాడు. "రెస్ట్ ఇన్ పీస్ డాడ్.. థాంక్యూ ఫర్ ఎవ్రీథింగ్" అని జోస్ బట్లర్ తన తండ్రితో కలిసి దిగిన ఫోటోను పోస్ట్ చేశాడు. తన తండ్రితో కలిసి వన్డే వరల్డ్ కప్ ట్రోఫీని పట్టుకున్న ఫోటోను జోస్ బట్లర్ షేర్ చేశాడు. అయితే తన తండ్రి మృతికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. కాగా.. జాన్ బట్లర్ ఆత్మకు శాంతి కలగాలని.. జోస్ బట్లర్ కుటుంబం ధైర్యంగా ఉండాలని కాంక్షిస్తూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఈ విషాద సమయంలో కూడా జోస్ బట్లర్ ది హండ్రెడ్ టోర్నీలో తన జట్టు అయిన మాంచెస్టర్ ఒరిజినల్స్ తరఫున ఆడారు. జోస్ బట్లర్ తండ్రికి నివాళిగా జట్టు సభ్యులందరూ బ్లాక్ ఆర్మ్ బ్యాండ్‌లు ధరించారు. ఈ మ్యాచ్ లో నాలుగు బంతులను ఎదుర్కొన్న జోస్ బట్లర్ ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు.

# ఇకపై పాకిస్తాన్‌తో మ్యాచ్‌లు వద్దు శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది



ఆసియా కప్‌లో జరగనున్న భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌పై శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది తీవ్రంగా స్పందించారు. ఆ మ్యాచ్‌పై ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. ఆమె పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలపై పునరాలోచించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకవైపు పాకిస్థాన్ మనల్ని నిరంతరం బెదిరిస్తుంటే.. మరోవైపు మనం వారితో క్రికెట్ ఆడటానికి సిద్ధమవుతున్నామని ఆమె ప్రశ్నించారు. "ఈ ద్వంద్వ వైఖరి ఎందుకు? ఇకపై పాకిస్థాన్‌తో ఎటువంటి మ్యాచ్‌లు ఉండవని మనం చెప్పలేమా?" అని ఎంపీ ప్రియాంక చతుర్వేది ప్రశ్నలు గుప్పించారు.పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ చేసిన.."పాకిస్థాన్ మునిగితే సగం ప్రపంచాన్ని కూడా ముంచేస్తుంది" అనే ప్రకటనను ఆమె ఒక డొల్ల బెదిరింపుగా అభివర్ణించారు. "ఇది కేవలం భయపెట్టే ప్రయత్నం మాత్రమే. దీనిలో ఎటువంటి నిజం లేదు. పాకిస్తాన్‌కు ఎలా సమాధానం చెప్పాలో మన వైమానిక దళం ఇప్పటికే చూపించింది. ఆపరేషన్ సిందూర్ దీనికి గొప్ప ఉదాహరణ" అని ఆమె అన్నారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అమెరికా గడ్డపై నుంచి భారత్‌కు అణుయుద్ధం గురించి బెదిరిస్తున్నప్పుడు, మనం వారితో క్రికెట్ గురించి ఎందుకు మాట్లాడుతున్నామని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది దేశ ప్రజలకు అన్యాయం అన్నారు. పాకిస్తాన్‌తో మన విధానం స్పష్టంగా ఉండాలని, అన్ని రకాల సంబంధాలపై పునరాలోచించాలని ఆమె డిమాండ్ చేశారు.ఎన్నికల సంఘం ఇండియా కూటమి నాయకులను సమావేశానికి పిలవడంపై ఎంపీ ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ.. ఇది బలవంతంగా తీసుకున్న నిర్ణయమని అన్నారు. ప్రజల ఓటింగ్ హక్కుల కోసం ప్రతిపక్షం నిరంతరం పోరాడుతున్నప్పటికీ ఎన్నికల సంఘం, ప్రభుత్వం కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయని ఆమె ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలు చాలా ముఖ్యమైనవని ప్రియాంక చతుర్వేది అన్నారు. రాహుల్ మీడియాలో వాస్తవాలను ఎన్నికల సంఘానికి ఆధారాలను సమర్పించినప్పటికీ ఇప్పుడు ఆయనను అఫిడవిట్ కోరడం ప్రతిపక్షం గొంతు నొక్కడానికి ప్రయత్నిస్తున్నట్లు చూపిస్తుందని ఆమె అన్నారు.ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (%=ూూ%) చీఫ్ మోహన్ భగవత్ ప్రకటనను ఆమె స్వాగతించారు. ప్రభుత్వం ఆరోగ్య బీమాపై జీఎస్టీని తొలగించి, సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించాలని ఆమె కోరారు. విద్య, ఆరోగ్యం ఏ దేశానికైనా పునాది అని, వాటిపై ప్రభుత్వం సీరియస్‌గా పనిచేయాలని ఆమె అన్నారు.చివరగా, పాకిస్తాన్ మనల్ని బెదిరించినప్పుడు వారితో క్రికెట్ వంటి క్రీడలు ఆడటం అవసరమా అని ప్రియాంక చతుర్వేది ప్రశ్నించారు. పాకిస్తాన్‌పై స్పష్టమైన విధానం ఉండాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ ఫోకస్!

భారత్‌లోని అత్యంత ప్రతిభావంతులైన యువ బ్యాటర్లలో ఒకడైన వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఆస్ట్రేలియా పర్యటన కోసం ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. ఈ 14 ఏళ్ల యువ సంచలనం ఇప్పటికే తన ప్రతిభతో క్రీడా ప్రపంచంలో ప్రకంపనలు సృష్టించాడు. ఇంగ్లండ్ నుంచి తిరిగి వచ్చిన వెంటనే రాజస్థాన్ రాయల్స్‌తో ప్రత్యేక ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. అక్కడి నుంచి నేరుగా నేషనల్ క్రికెట్ అకాడమీ కి వెళ్లిన వైభవ్ సూర్యవంశీ కోసం ఒక ప్రత్యేక శిక్షణ షెడ్యూల్‌ను రూపొందించారు. దీనిలో ముఖ్యంగా టెక్నికల్ డ్రిల్స్, మ్యాచ్ పరిస్థితులపై దృష్టి సారించే విధంగా శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ చిన్ననాటి కోచ్ మనీష్ ఓఝా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం కేవలం ఆస్ట్రేలియా పర్యటన కోసం కాదని.. భవిష్యత్తు కోసమని చెప్పారు. భారత క్రికెట్ భవిష్యత్ కోసం బీసీసీఐ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణమయని తెలిపారు. "సీనియర్ ఆటగాళ్లు రిటైర్ అవుతున్నందున వారి స్థానాన్ని భర్తీ చేయడానికి యువ ఆటగాళ్లను సిద్ధం చేయాలి. ఈ శిక్షణ ఆ ప్రక్రియలో భాగమే. మేము ఒక్కొక్కరిని ఎంపిక చేసి, అంతర్జాతీయ క్రికెట్‌కు అవసరమైన అన్ని నైపుణ్యాలలో వారిని నిష్ణాతులను చేస్తాం." అని మనీష్ ఓఝా వివరించారు."వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడే బ్యాటింగ్ శైలి టీ20, వన్డే క్రికెట్లలో మంచి విజయాన్ని తెచ్చిపెట్టింది. ఐపీఎల్, అండర్-19, విజయ్ హజారే టోర్నమెంట్లలో ఈ ప్రతిభను చూశాం. అయితే టెస్ట్ ఫార్మాట్‌లో వైభవ్ ప్రదర్శనలో స్థిరత్వం ఇంకా పెరగాలి" అని మనీష్ ఓఝా అభిప్రాయపడ్డారు. "వైభవ్ బలహీనత ఏంటంటే, తెల్ల బంతి క్రికెట్‌తో పోలిస్తే టెస్ట్ ఫార్మాట్‌లో అతని ప్రదర్శన స్థాయి తగ్గుతుంది. మా లక్ష్యం ఆ స్థిరత్వాన్ని మెరుగుపరచడమే. అతను 10 ఇన్నింగ్స్‌లు ఆడితే, కనీసం 7-8 ఇన్నింగ్స్‌లు ప్రభావవంతంగా ఉండాలి" అని మనీష్ ఓఝా అన్నారు.ఈ శిక్షణలో వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌తో పాటు అతని ఫిట్‌నెస్, ఫీల్డింగ్, ఇతర అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇంకా టీనేజ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీ ఒక కీలక దశలో ఉన్నాడు. సహజమైన టాలెంట్ ఇప్పటికే వైభవ్ సూర్యవంశీని నిలబెడుతోంది. కానీ పూర్తి స్థాయి అంతర్జాతీయ ఆటగాడికి ఎదగడానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాలి.




# బ్రహ్మానందంతో రామ్ చరణ్ దంపతులు




లెజెండ్ కమెడియన్ బ్రహ్మానందంకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సడన్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు. ఆదివారం రామ్ చరణ్ తన సతీమణి ఉపాసనతో కలిసి బ్రహ్మానందం ఇంటిని సందర్శించి వారి కుటంబ సభ్యులతో కాసేపు కాలక్షేపం చేశారు. అయితే బ్రహ్మానందం చిన్న కుమారుడు సిద్ధార్థ్‌కు ఇటీవలే బిడ్డ జన్మించడంతో హాస్య బ్రహ్మ మరోమారు తాత అయ్యారు. ఈ నేపథ్యంలోనే రామ్ చరణ్ దంపతులు ఆదివారం మధ్యాహ్నం బ్రహ్మానందం ఇంటికి లంచ్‌కి వెళ్లి వారి ఫ్యామిలీతో సరదాగా గడిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో ఇప్పటికే వైరల్ అవుతున్నాయి. బ్రహ్మానందం కుటంబానికి పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

# మాస్ జాతర టీజర్ విడుదల

కథానాయకుడు రవితేజ నుంచి రానున్న 75వ చిత్రం 'మాస్ జాతర'భాను భోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయిక. ఆగస్టు 27న ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో రవితేజ పోలీస్ పాత్రలో 'నాకంటూ ఓ చరిత్ర ఉంది..' అంటూ మాస్ డైలాగులతో అలరిస్తూ కనిపించారు. ఈ మాస్ మహారాజ్ పంచ్‌లు వేస్తోన్న టీజర్‌ను చూసిన వారు బాగుందని అంటున్నారు.




# సత్యదేవ్ కథానాకుడిగా ఆర్‌బి వర్కింగ్ టైటిల్




కేరాఫ్ కంచరపాలెం' ,'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు వెంకటేశ్ మహా. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ సినిమాల అనంతరం వెంకటేశ్ చాలా రోజుల గ్యాప్ తర్వాత తన కొత్త సినిమాను ప్రకటించాడు. ఆర్‌బీ అనే వర్కింగ్ –టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో సత్యదేవ్ కథానాయకుడిగా నటించబోతుండగా.. జీఎంబీ, శ్రీచక్ర ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌లపై మహేశ్ బాబు, అనురాగ్ రెడ్డి నిర్మించబోతున్నట్లు– సమాచారం. ఈ సినిమా –టైటిల్‌తో పాటు– ఫస్ట్ లుక్‌ని మంగళవారం గంటలకు విడుదల చేయబోతున్నట్లు– చిత్రయూనిట్ సోషల్ ప్రకటించింది. మీడియా వేదికగా

# సినిమా వేరు..వ్యక్తిగత జీవితం వేరు – రష్మిక

సామాజిక మాధ్యమాల్లో ఎన్ని విమర్శలు ఎదురైనప్పటికీ దృఢంగా ఉండి.. నా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నానని అందాల తార రష్మిక అంటోంది. 'పుష్ప 2', 'కుబేర' చిత్రాలతో వరుస విజయాలందుకొని జోరుమీదుందీ భామ. ప్రస్తుతం మహిళా ప్రాధాన్య కథలతో బిజీగా గడుపుతున్న ఆమె.. తన భావోద్వేగాలను ప్రజల ముందు ప్రదర్శించడానికి ఇష్టపడనని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక మాట్లాడుతూ.. నేను ఒక నటిని. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. నేను ఇంట్లో ఎలా ఉంటానో చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. చాలా ఎమోషనల్ పర్సన్‌ని నేను. కానీ నేను నా భావోద్వేగాలను బయటికి చూపించను. ఎందుకంటే అభిమానులు నా దయా గుణాన్ని నా బలహీనత అనుకుంటారు. లేకపోతే నేను కెమెరాల కోసమే ఇదంతా చేస్తున్నా అనుకుంటారు. మనం ఎంత నిజాయతీగా ఉంటే.. అంత వ్యతిరేకత మనపై వస్తుంది. దీంతో పాటు నా చుట్టూ ఉండే నెగిటివిటీతో ప్రభావితం కాకుండా ఉండటానికి కూడా కష్టపడుతున్నానని చెప్పుకొచ్చింది.



# సుధీర్ బాబు.. నిఖిల్ సినిమాలు

## ఇద్దరికీ పరీక్ష పెట్టనున్న జటాధర, స్వయంభు




ఒక్కోసారి కథ కాదు టైటిల్ లోనే పవర్ కనిపిస్తుంది. ఆడియన్స్ ను ముందు థియేటర్ కి రప్పించేవి –టైటిల్సే. అలాంటి ఓ మంచి టైటిలే జటాధర... ఒక పవిత్రమైన శబ్దం. శివుడి రూపం. శాంతంగా కనిపించినా శత్రువుల మీద శివతాండవం చేస్తాడు. ఇప్పుడు అదే ఫార్ములాతో సుధీర్ బాబు మళ్లీ వచ్చాడు! మాస్ హిట్ కోసం ఎదురు చూస్తున్న సుధీర్ బాబుకు ఈ సినిమా మంచి హిట్ అవుతుందని ఫీలవుతున్నారు ఆయన ఫ్యాన్స్. తెలుగు, హిందీ రెండు భాషల్లో రానున్న ఈ సినిమాలో సోనాక్షి సిన్హా హీరోయిన్. భాగీతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన సుధీర్ బాబు ఈసారి ఎపిక్ వార్ జటాధర తో ఎలాంటి హైప్ క్రియేట్ చేసుకుంటాడో చూడాలి...ఈసారి హిట్ కొడితే తెలుగులో ఆయన కెరీర్‌లో టర్నింగ్ పాయింటే అవ్వాలని, ఫెయిల్యూర్స్ ని ఎరేజ్ చేసే ఎపిక్ వార్ జటాధర కావాలని ఆయన అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఇక నిఖిల్ కార్తికేయ 2 వంటి భక్తి , మిస్టరీ, యాక్షన్ థ్రిల్లర్ తో పాన్ ఇండియా విజయం అందుకున్నాడు. ఇప్పుడు అదే షేడ్స్ తో 'స్వయంభు' వస్తోంది. స్వయంభు లో మహాభారతం టచ్, హీరో లుక్‌లో వారియర్ వైబ్రేషన్, విజువల్స్‌లో ఓ ఎపిక్ వార్ ఫీల్ కనిపిస్తోంది. మోషన్ పోస్టర్ , ఓపెనింగ్ గ్లింప్స్ గ్రాండియర్ లుక్ లో కనిపిస్తున్నాయి. ఫుల్ క్లాస్ ఎండ్ మాస్ అప్పీల్ తో ఈ సినిమా రాబోతున్నట్టు కనిపిస్తోంది. డైరెక్టర్ భరత్ క్రిష్ణమాచారి విజువల్ స్కేల్ కు ప్రాధాన్యం ఇస్తున్నాడు. బాహుబలి, ట్రిపుల్ లాంటి విజువల్ వండర్స్ కి రూపం ఇచ్చిన సెంథిల్ కుమార్ స్వయంభుకి సినిమాటోగ్రాఫర్ గా చేస్తున్నాడు. నిఖిల్ సరసన సంయుక్త మీనన్ నటిస్తోంది. దాంతో స్వయంభు మీద భారీ ఆశలే పెట్టుకున్నాడు నిఖిల్. ఇద్దరి యంగ్ హీరోలకు ఇప్పుడు హిట్ అనేది చాలా కీలకం.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685